బుధవారం
18-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 206
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అన్ని వ్యవస్థలు బీజేపీ స్వాధీనం

దేశంలోని అన్ని వ్యవస్థలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ స్వాధీనం చేసుకున్నాయని, మీడియా, ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థలు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నియంత్రణలో ఉన్నాయని, అన్ని ఇనిస్టిట్యూషన్లపై ఒత్తిడి పెరిగిపోతోందన్నారు.

8లో

సీపీఐ పోరుబాట

- టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల పరిశీలన
- లబ్ధిదారుల సంతకాల సేకరణ
- జగనన్న లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- సిమెంట్, ఇసుక, కంకరు పూర్తిగా ఉచితంగా ఇవ్వాలి
- సమస్యలు పరిష్కారమయ్యేదాకా ఉద్యమం ఆగదని రామకృష్ణ స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు, లబ్ధిదారుల సమస్యలు, టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి, కేటాయింపు ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట కార్యక్రమం ప్రారంభమైంది. పార్టీ శ్రేణులు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, కార్యకర్తలు లబ్ధిదారులను నేరుగా కల్సుకుని సంతకాల సేకరణ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్ర పాడు గ్రామంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జగనన్న కాలనీల లబ్ధిదారులను, టిడ్కో గృహాల లబ్ధిదారులను కలిసి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల స్థలాల పంపిణీకి ఆనాడు రూ.20 వేల కోట్లు పైన ఖర్చు చేశారని అన్నారు. పల్లెల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి ఉంటే బాగుండేదని, అలా కాకుండా పట్టణాలలో సెంటు, గ్రామాలలో సెంటున్నర ఇవ్వడం శాశ్వత పరిష్కారం కాదన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇస్తామంటున్నదని, అందులో పునాదికి కేవలం రూ.33 వేలు ఇస్తున్నదన్నారు. వాస్తవానికి పునాది వేసుకోవడానికి కనీసం రూ.85 వేలు ఖర్చు అవుతుందన్నారు. ఈ విధంగా చూస్తే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవన్నారు. ఒక ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.7 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారని, అందువల్ల లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు ఉచితంగా సరఫరా చేసి రూ.5 లక్షలు వారి చేతికి ఇవ్వాలని కోరారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు యుద్ధప్రాతిపదికన గృహాలు అప్పగించాలని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు కరెంటు, వాటర్, డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల్లో తాము సేకరించిన అర్జీలు అందజేస్తామని, అప్పటికి కూడా ప్రభుత్వం దిగిరాకపోతే ఫిబ్రవరి 6న రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున

- మిగతా 2 లో

గుంతకల్లులో సంతకాలు సేకరిస్తున్న జగదీశ్

గుంటూరులో జంగాల నేతృత్వంలో...

రేవేంద్రపాడులో లబ్ధిదారుల సమస్యలు వింటున్న రామకృష్ణ

బీజేపీ అధ్యక్షుడిగా మరో ఏడాది నడ్డా

న్యూఢిల్లీ:
బీజేపీ అధ్యక్షుడిగా జేపీ నడ్డా పదవీ కాలాన్ని 2024 జూన్ వరకు పొడిగించారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రతిపాదనను ఆ పార్టీ జాతీయ కార్య వర్గం మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానించింది. అద్వాణీ, అమిత్ షా తర్వాత బీజేపీ అధ్యక్షుడిగా పదవీ కాలంలో పొడిగింపు పొందిన నేతగా జగత్ ప్రకాశ్ నడ్డా నిలిచారు. 2020 జనవరి 20 నుంచి బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న నడ్డా పదవీ కాలం నెలాఖరుకు ముగుస్తుంది. నడ్డా వచ్చే ఏడాది జూన్ వరకు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. పార్టీ సభ్యత్వ నమోదు ముగియని కారణంగా పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికల నిర్వహణ కుదరని దృష్ట్యా నడ్డా పదవీకాలాన్ని పొడిగించడం అనివార్యమైనట్లు తెలిపారు. జన్ సంఘ్ రోజుల నుంచి బూత్ నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడి స్థాయి వరకు పదవులకు ఎన్నికలను నిర్వహించే అత్యంత ప్రజాస్వామ్యబద్ధ పార్టీ

- మిగతా 2 లో

బీజేపీ ఓటమే లక్ష్యం

- ఎన్డీయే వ్యతిరేక కూటమి అవసరం
- బీఆర్ఎస్‌తో కలిసి ముందుకెళ్తాం
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

విశాలాంధ్ర-హైదరాబాద్:
ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బీజేపీ ఓటమే తమ ప్రధాన లక్ష్యమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్పష్టంచేశారు. ఖమ్మంలో బుధవారం జరగనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో పాల్గొనేందుకు రాజా మంగళవారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సభలో పాల్గొనేందుకు వచ్చినట్టు తెలిపారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమిని రానున్న ఎన్నికలలో ఓడించేందుకు బీఆర్ఎస్‌తో కలిసి ముందుకు వెళ్లనున్నట్టు చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు, కూలీ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోందనీ, పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారని విమర్శించారు. పేదలు, ధనికుల మధ్య అంతరం మరింత పెరిగిపోవడానికి మోదీ ప్రభుత్వ విధానాలే

- మిగతా 2 లో

ఆహారధాన్యాల పంపిణీ కొనసాగించాలి

నిలిపివేత తగదు: సీపీఐ

న్యూఢిల్లీ:
పేదలకు ఆహార ధాన్యాల పంపిణీ నిలిపివేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఖండించింది. ఆహార భద్రతా చట్టం కింద పేదలకు ఆహార ధాన్యాల పంపిణీని నిలిపివేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయంపై పునరాలోచించాలని కేంద్రాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం డిమాండ్ చేసింది. ఈ నిర్ణయం ప్రభావం పేదలపై తీవ్రంగా ఉంటుందని, మార్కెట్ నుంచి అధిక ధరలకు ఆహార ధాన్యాలను కొనుగోలు చేయాల్సి రావడంతో వారిపై భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేసింది. ఎంఎస్పీ చట్టం కోసం రైతులు డిమాండ్ చేస్తున్నారు గానీ భవిష్యత్‌లో ఎంఎస్పీ విధానానికి చెక్ పెట్టే సంకేతాలను ప్రభుత్వమిస్తోందని సీపీఐ హెచ్చరించింది.

మొండి పట్టుదల

- జీవో1పై సుప్రీంలో పిటిషన్
- ప్రజా నిరసనలు వెల్లువెత్తుతున్నా పట్టని జగన్ సర్కార్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
జీవో నం.1పై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా జగన్ ప్రభుత్వం మాత్రం దానిపై ముందుకే వెళ్లాలని భావిస్తోంది. ప్రజాందోళనలను, ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదుల విమర్శలను లెక్క చేయడం లేదు. రహదారులపై సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకుండా ప్రతిపక్షాల గొంతునొక్కే జీవో నం.1ని హైకోర్టు ఇటీవల నిలుపు దల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఈలోపే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించడం చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో అమలు కోసం ఎంత ఉత్సాహాన్ని కనబరుస్తుందో అర్థమవుతుంది. ప్రజాస్వామిక హక్కులను కాలరాసే విధంగా వైసీపీ ప్రభుత్వం జనవరి 2వ తేదీ తెచ్చిన జీవో నం.1ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఎన్.అశ్వినీకుమార్ వాదనలు వినిపిస్తూ... స్వాతంత్ర్యోద్యమ సమయంలో ర్యాలీలు, బహిరంగసభలను అడ్డుకునేందుకు బ్రిటీష్ ప్రభుత్వం 144 సెక్షన్ విధించింది తప్ప ఇలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పోలీస్ చట్టం సెక్షన్ 30,30(ఎ)ని ఆధారంగా చూపుతూ బహిరంగ సమావేశాలను నిలువరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జీవోలో నిషేధం అనే పదం వినియోగించకుండా పరోక్షంగా ఆ పని చేసింది. అధికరణ 19(1) భావ ప్రకటన స్వేచ్ఛను కల్పిస్తోంది. శాంతియుతంగా నిర్వహించుకునే కార్యక్రమాలకు పోలీసుల అనుమతి అక్కరలేదు. అరుదైన ప్రత్యేక పరిస్థితుల్లోనే సమావేశాలకు అనుమతిచ్చే అంశాన్ని పరిశీలించాలని జీవోలో పేర్కొన్నారు. అసలు ప్రత్యేక పరిస్థితులున్నాయని నిరూపించుకోవల్సిన అవసరం ఏముంటుంది ? నచ్చినవారికి అనుమతి ఇచ్చి, నచ్చనివారికి నిరాకరించాలనే ఇలాంటి షరతు విధించారు. పోలీసులను సంతృప్తి పరచాలని షరతు పెట్టడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను హరించడమే అవుతుంది. రహదారులపై ఊరేగింపు శాంతికి విఘాతం కారణం కావచ్చనే ఊహాగానాలతో ముందే నిర్ణయానికి వచ్చి అడ్డుకుంటామనడం సరికాదు. బహిరంగసభ సమావేశాల నియంత్రణ ముసుగులో ప్రభుత్వం పూర్తి నిషేధం విధిస్తోంది. ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని, అందువల్ల ఈ జీవో అమలును నిలిపివేస్తూ ఉత్తర్వులివ్వాలని కోరగా, హైకోర్టు జీవో నంబరు ఒకటిని ఈనెల 23వరకు నిలిపివేయగా ఆ తీర్పును సవాల్ చేస్తూ జగన్ సర్కారు సుప్రీంను ఆశ్రయించింది.

ఇదీ లోకం!

ఆంధ్రప్రదేశ్‌లో దీన్ని చాలా బాగా వాడాలని చెప్పడం జరిగింది!

నేడే బీఆర్ఎస్ ఆవిర్భావ బహిరంగ సభ

- హాజరవుతున్న జాతీయ నేతలు
- ఖమ్మంలో భారీ బందోబస్తు
- నాలుగువేల మంది పోలీసులతో భద్రత

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం:
బీఆర్ఎస్ ఆవిర్భావాన్ని పురస్కరించుకొని బుధవారం ఖమ్మంలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు బీ ఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కార్యదర్శి, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, అదే

- మిగతా 2 లో

గుణపాఠం నేర్చుకున్నాం

- భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నాం
- కశ్మీర్‌తో సహా కీలకాంశాలపై చర్చకు సిద్ధం
- పాక్ ప్రధాని షెహబాబ్ షరీఫ్

ఇస్లామాబాద్:
భారత్‌తో సత్సంబంధాలను కోరుకుంటున్నామని, కలిసిమెలిసి బతకాలని భావిస్తున్నామని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. కశ్మీర్‌తో సహా కీలకాంశాలపై సానుకూల చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పొరుగు దేశాలైనందున కలిసికట్టుగా శాంతియుతంగా మనుగడ సాగిస్తే బాగుంటుందని, అనవసరంగా గొడవలు పడటం వల్ల సమయం-వనరులు వృథా అవడం తప్ప ఫలితం ఉండదని చెప్పారు. అణ్వాయుధాలున్న దేశాలు కాబట్టి యుద్ధం సంభవిస్తే జరిగే నష్టాన్ని ఎవ్వరూ అంచనా వేయలేరని ఆయన ఓ విధంగా హెచ్చరిక చేశారు. ఇప్పటికే మూడు యుద్ధాలు జరిగిన క్రమంలో గుణపాఠం నేర్చుకున్నామన్నారు. కీలకాంశాలపై భారత్‌లో నిశిత చర్చలకు సిద్ధమని షరీఫ్ అన్నారు. కశ్మీర్‌తో పాటు అన్ని సమస్యల సామరస్య పరిష్కారానికి భారత ప్రధాని మోదీతో మాట్లాడాలని భావిస్తున్నట్లు దుబాయి వార్తాఛానల్ అల్ అర్బియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షరీఫ్ తెలిపారు. అణు సంపన్న పొరుగు దేశాల మధ్య చర్చల పునరుద్ధరణలో యూఏఈ మధ్యవర్తిత్వం వహించేందుకు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. కశ్మీర్, సరిహద్దు ఆవలి ఉగ్రవాదం క్రమంలో భారత్-పాకిస్తాన్‌కు మధ్య సంబంధాలు చెడిపోయాయన్నారు. కశ్మీర్ తదితర కీలకాంశాల పరిష్కారం కోసం కూర్చొని మాట్లాడుకుందామని భారత ప్రభుత్వాన్ని, ప్రధాని మోదీని కోరుతున్నానన్నారు. ఇరుగు-పొరుగు దేశాలుగా కలిసి ఉందామన్నారు. శాంతియుతంగా ఉండటం, పురోగతి సాధించడం లేక కొట్లాడుకోవడం, సమయాన్ని వనరులను వృథా చేయడం మనపైనే ఆధారపడి

- మిగతా 2 లో

అంతర్జాతీయ ఉగ్రవాదిగా మక్కీ

ఐరాస భద్రతా మండలి ప్రకటన

ఐరాస: పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తొయిబా (ఎల్‌ఈటీ) డిప్యూటీ చీఫ్ అబ్దుల్ రెహమాన్ మక్కిని 'అంతర్జాతీయ ఉగ్రవాది'గా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రకటించింది. ఐఎస్‌ఐఎల్, అల్ ఖైదా ఆంక్షల కమిటీ కింద మక్కీని అంతర్జాతీయ ఉగ్రవాది జాబితాలో చేర్చినట్లు భద్రతా మండలి తెలిపింది. మక్కీని 'గ్లోబల్ టెర్రరిస్ట్' జాబితాలో చేర్చాలని గతేడాది జూన్‌లో భారత్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను 'నో ఆబ్జక్షన్ విధానం' కింద కమిటీలోని 15 సభ్యదేశాలకు పంపింది. ఈ ప్రతిపాదనను చైనా 'టెక్నికల్ హోల్డ్'లో ఉంచింది. భద్రతా మండలి విధి విధానాల ప్రకారం దీన్ని ఆరు నెలల వరకు కొనసాగించవచ్చు. అయితే సోమవారం ఈ ప్రతిపాదనపై తమ పట్టును చైనా సడలించడంతో మక్కీని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ఐరాస భద్రతా మండలి ప్రకటించింది. జమ్ముకశ్మీర్‌లో నిధుల సేకరణ, యువతను హింసలో భాగస్వామ్యులు చేయడం, దాడులకు కుట్రలు పన్నడం వంటివాటి నేపథ్యంలో మక్కీని ఉగ్రవాది జాబితాలో భారత్ ఇప్పటికే చేర్చివున్న సంగతి విదితమే. మక్కీ (68) ఎల్‌ఈటీ చీఫ్ హాఫీజ్ సయీద్ బావమరిది. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లోగల బహావల్పూర్‌లో మక్కీ జన్మించాడు. మక్కీ ఇంతకుముందు ఎల్‌ఈటీ విదేశీ సంబంధాల శాఖాధ్యక్షుడిగా, షురా (గవర్నింగ్ బాడీ) సభ్యుడిగా ఉన్నాడు. జేడీయూ మర్కజీ (సెంట్రల్) టీమ్, దావతీ బృంద సభ్యునిగా మక్కీని అమెరికా ఉగ్రవాద ముద్ర వేసింది. 2019 మే 15న పాకిస్తాన్‌న ప్రభుత్వం మక్కీని అరస్టు చేసి లాహోర్‌లో గృహ నిర్బంధంలో ఉంచింది. ఉగ్రనిధుల సేకరణలో కీలక పాత్ర పోషించడంతో అతనికి 2020లో పాకిస్తానీ కోర్టు శిక్ష విధించింది.

తగ్గిన చైనా జనాభా

- 1,411 బిలియన్లుగా నమోదు
- 60 ఏళ్లలో తొలిసారి..

బీజింగ్: ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల దేశంగా ప్రాచుర్యం పొందిన చైనాలో ఇప్పుడు జనాభా తగ్గిపోయి 1,411 బిలయన్లకు చేరింది. 60ఏళ్లలో మొదటిసారి ఇలా జరిగినట్లు చైనా అధికారులు తెలిపారు. ఈ లెక్కన కేవలం ఏడాది కాలంలో 8,50,000 మంది తగ్గినట్లు చైనా జాతీయ జనగణన బ్యూరో (సీఎన్‌బీఎస్) మంగళవారం వెల్లడించింది. 2022 చివరికి దేశ జనాభా 1,411.75గా ఉన్నదని 31 ప్రావిన్సులు, స్వయంప్రతిపత్తి ప్రాంతాలు, మున్సిపాలిటీలు కలుపుకొని ఈ లెక్క తేల్చినట్లు వెల్లడించింది. హాంగ్‌కాంగ్, మకావ్, తైవాన్, 31 ప్రావిన్సుల్లో ఉంటున్న విదేశీయులను లెక్కించలేదని తెలిపింది. 2021 చివరికి 0.85 మిలియన్ల మేర జనాభాలో తగ్గుదల నమోదైనట్లు పేర్కొంది. చైనాలో పురుషులు 722.06 మిలియన్లు కాగా మహిళలు 689.69 మిలియన్లుగా ఉన్నట్లు తెలిపింది. లింగనిష్పత్తి 104.69గా ఉన్నదని వెల్లడించింది. 2022లో 9.56 మిలియన్ల జననాలు నమోదు కాగా జననాల రేటు ప్రతి వెయ్యి మందికి 6.77గా నమోదైందని, 10.41 మిలియన్ల మరణాలు సంభవించగా, మరణాల రేటు వెయ్యికి 7.37గా ఉన్నట్లు పేర్కొంది. సహజ జనభా వృద్ధిరేటు వెయ్యికి మైనస్ 0.60గా ఉన్నట్లు తెలిపింది. పనిచేసే వయస్సు అంటే 16 నుంచి 59 ఏళ్లవారు 876.6 మిలియన్లు (జనాభాలో 62శాతంగా) ఉన్నారు. 65ఏళ్లపైబడిన వారు 280 మిలియన్ల మంది ఉంటే అంతకుమించి వయస్సుగలవారు 209.8 మిలియన్లు (జనాభాలో 14.9శాతంగా) ఉన్నట్లు బ్యూరో ప్రకటన పేర్కొంది. 1979లో అమలు చేసిన ఒకటే సంతానం విధానం వల్ల చైనా జనాభాలో లింగ సమతుల్యత దెబ్బతిన్నది. అధిక జనాభా, కరవు నివారణకు చైనా ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసింది. పట్టణాల్లో ఉన్న దంపతులు ఒక్క బిడ్డకు జన్మనివ్వాలని, గ్రామీణ దంపతులు ఇద్దరికి జన్మనివ్వవచ్చునని పేర్కొంది. అయితే మొదటి సంతానం ఆడబిడ్డ అయితేనే రెండవ సంతానానికి అనుమతి ఉంటుంది. 2013లో ఈ మేరకు విధించిన ఆంక్షలను చైనా ప్రభుత్వం సడలించింది. కానీ పెద్దగా ఫలితం కనిపించలేదు. దీంతో 2016లో ఇద్దరు బిడ్డలకు జన్మనివ్వొచ్చునని యువదంపతులకు సూచించినా జననాల రేటులో తేడా కనిపించలేదు. పర్యవసానంగా 2021లో జనాభా చట్టాన్ని సవరించింది. ముగ్గురు పిల్లలకు అనుమతిచ్చింది. గతంలో విధించిన జరిమానాలు, పెండింగ్ చెల్లింపులను రద్దు చేసింది.

కాలిఫోర్నియాలో కాల్పుల కలకలం

అరు నెలల చిన్నారితో సహా ఆరుగురి మృతి

వాషింగ్టన్: అమెరికాలో మరోమారు తుపాకీ పేలింది. కాలిఫోర్నియాలో ఆరు నెలల చిన్నారితో పాటు ఆరుగురు కాల్చివేతకు గురయ్యారు. జోక్విన్ వ్యాలీ తులారేశాన్ పట్టణంలో సోమవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొనేలోపు నిందితులు పరారయ్యారు. కాల్పుల అనంతరం కొందరు ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండటంతో స్థానికులు అత్యవసర వైద్య సేవలు అందించారు. ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వారు మృతిచెందారు. తులారే కౌంటీ షెరీఫ్ మైక్ బౌడ్రెక్స్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ముఠా కాల్పులకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. మృతుల్లో ఆరు నెలల చిన్నారి, 17ఏళ్ల తల్లి అక్కడికక్కడే మరణించినట్లు తెలిపాడు. పథకం ప్రకారమే ఈ హత్యలు జరిగాయన్నారు. వారం కిందట ఇదే ఇంట్లో నార్కోటిక్స్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించి మాదకద్రవ్యాలను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. తాజాగా అదే ఇంటిపై డ్రగ్స్ ముఠా సభ్యులు దాడిచేశారు. కాల్పులు జరిపింది ఇద్దరని తెలిసిందని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

ఫ్లోరిడాలో మరో 8మందికి గాయాలు

ఫ్లోరిడాలో కాల్పులు కలకలం రేపాయి. కాల్పుల్లో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఫ్లోరిడాలోని ఫోర్ట్ పియర్స్‌లో జరిగిన కాల్పుల్లో ఎనిమిది మంది గాయపడ్డారని, వారిని ఆసుపత్రికి తరలించినట్లు సెయింట్ లూసీ కౌంటీ షెరీఫ్ కార్యాలయం చీఫ్ డిప్యూటీ బ్రైన్ హెస్టర్ తెలిపారు. కాల్పుల క్రమంలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల్లో మరో నలుగురికి స్వల్పంగా గాయాలైనట్లు వెల్లడించారు.

వియత్నాం అధ్యక్షుడి రాజీనామా

బాంకాక్: వియత్నాం అధ్యక్షుడు న్యుయెన్ జువాన్ ఫుక్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. అత్యున్నత పదవికి రాజీనామా చేసిన ప్రభుత్వంలోని అత్యంత సీనియర్‌గా ఈయన నిలిచారు. అధికార కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీకి తన రాజీనామా లేఖను ఫుక్ సమర్పించినట్లు వియత్నాం వార్తాసంస్థ పేర్కొంది. ఏ పదవిలోనూ కొనసాగబోనని, పదవీ విరమణ చేస్తున్నానని రాజీనామా లేఖలో తెలిపారు. ఫుక్ (68) 1979 నుంచి ప్రభుత్వ సేవల్లో ఉన్నారు. 2006లో ప్రభుత్వంలో తొలి పదవిని అలంకరించారు. 2011లో పొలిట్‌బ్యూరోలో చేరారు. 2016 నుంచి 2021 వరకు ప్రధాన మంత్రిగా పనిచేశారు. ఫుక్ ప్రస్తుతం అధ్యక్షుడిగానే కాకుండా పొలిట్ బ్యూరో సభ్యత్వానికి, కేంద్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి, జాతీయ రక్షణ, భద్రతా మండలి చైర్మన్ బాధ్యతలకూ రాజీనామా చేశారు. ప్రధానమంత్రిగా వియత్నాంను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకదశకు తీసుకెళ్లారు. ఈయన మార్గదర్శకత్వంలో కోవిడ్ సమయంలోనూ వియత్నాం ఏడు శాతం ఆర్థిక వృద్ధిని నమోదుచేసింది.

బీజేపీ ఓటమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

కారణమన్నారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీయేని ఓడించేందుకు వ్యతిరేక కూటమి ఏర్పడాల్సిన అవసరాన్ని రాజా నొక్కి చెప్పారు. ఇందుకోసం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తులన్ని ఏకం కావాల్సిన అవసరం ఉందని రాజా ఉద్ఘాటించారు. మోదీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను ఒక్క దానిని కూడా అధికారం చేపట్టిన తరువాత అమలుచేయలేదన్నారు. నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనీ, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. లాభాలలో ఉన్న సంస్థలను కారుచౌకగా తన అనుకూలవర్గానికి అప్పగిస్తున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వ ఈ దుష్టవిధానాలను అన్ని వర్గాల వారు వ్యతిరేకించాలని రాజా పిలుపునిచ్చారు.

గుణపాఠం నేర్చుకున్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని భారత్‌నుద్దేశించి షరీఫ్ చెప్పారు. భారత్‌తో జరిగిన మూడు యుద్ధాల తర్వాత మాకు మిగిలినది పేదరికం, నిరుద్యోగం, కష్టాలేనని ఆవేదన వ్యక్తంచేశారు. 'గుణపాఠం నేర్చుకున్నాం. ఇకపై శాంతియుతంగా ఉండాలని అనుకుంటున్నాం. ఇందుకోసం ఉన్న సమస్యల పరిష్కారాన్ని కోరుకుంటున్నాం. పేదరికం నిర్మూలన, సుస్థిరత, సమృద్ధి సాధన, విద్య-ఆరోగ్య వసతుల కల్పన, ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆకాంక్షిస్తున్నాం. ఉన్న వనరులను బాంబులు, యుద్ధసామాగ్రిపై వృథా చేయాలని అనుకోవడం లేదు. ప్రధాని మోదీకి ఇవ్వాలనుకున్న సందేశమిదే' అని షరీఫ్ అన్నారు. మావి అణ్వాయుధాలను కలిగివున్న దేశాలు.. పొరపాటున యుద్ధం జరిగితే ఏం జరిగిందో చెప్పేందుకు ఎవరు ప్రాణాలతో ఉంటారో కూడా తెలియదని హెచ్చరించారు. పాకిస్తాన్, భారత్‌ను కలిపేందుకు యూఏఈ ప్రభుత్వం కీలకపాత్ర పోషించవచ్చునన్నారు. సౌదీ అరేబియా సోదర దేశమని కొనియాడారు. యూఏఈ మిలియన్ల మంది పాకిస్తానీలకు రెండవ ఇల్లు అని అన్నారు. ఇదిలావుంటే కశ్మీర్ అంశంపై మధ్యవర్తిత్వాన్ని భారత్ గతంలో తిరస్కరించడం విదితమే.

నేడే బీఆర్‌ఎస్ ఆవిర్భావ బహిరంగ సభ

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి చెందిన పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ పాల్గొంటున్నారు. ఐదు లక్షల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేశారు. దానికి అనుగుణంగా సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి అన్ని విధాలుగా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్ బీఆర్ఎస్ గా ఆవిర్భవించిన తర్వాత ఖమ్మం నగరంలో జరుగుతున్న ఈ మహాసభ చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు ఆ పార్టీ సకల ఏర్పాట్లు చేసింది. ఢిల్లీ, పంజాబ్, కేరళ ముఖ్యమంత్రులు కేసీఆర్‌తో కలిసి ఒకే హెలికాప్టర్‌లో హైదరాబాదు నుంచి బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం అక్కడే భోజనం చేసిన అనంతరం, ఆ పక్కనే ఏర్పాటుచేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారు. రెండు గంటలకు ప్రారంభమయ్యే సభ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగనుంది. భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలతో పాటుగా జాతీయ స్థాయి వామపక్ష నాయకులు కూడా ఈ మహాసభల్లో పాల్గొంటున్నందున ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు కూడా పెద్ద ఎత్తున ఈ మహాసభలకు హాజరవుతారని భావిస్తున్నారు. బీఆర్ఎస్ అగ్ర నేతలు ఇటీవల సన్నాహక సమావేశాల్లో వామపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలు కూడా సభకు హాజరయ్యేటట్లయితే వారిని కూడా కలుపుకొని రావాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఆవిర్భావ సభ జాతీయస్థాయిలో ఒక సందేశాన్ని ఇవ్వనుందని చర్చ జరుగుతోంది. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే అన్ని పార్టీలను కలుపుకొని పోవాలన్న దృక్పథంతో బీఆర్ ఎస్ అడుగులు వేస్తున్న విషయం విదితమే. బీఆర్ఎస్ జాతీయస్థాయిలో తన విధి విధానాలు ఏ విధంగా ఉంటాయో నేటి సభలో ప్రకటించనుంది. రానున్న ఎన్నికల్లో వామపక్ష పార్టీలను కలుపుకొని విజయం సాధించాలని ఆ పార్టీ భావిస్తోంది. వామపక్షాలకు మంచి పట్టు కలిగిన ఖమ్మం జిల్లా వేదికగా జరుగుతున్న ఈ సభ రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజకీయాలను మలుపు తిప్పటం ఖాయం అనే చర్చ ఆయా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. బహిరంగ సభలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం పాల్గొంటున్నారు.

పెట్టుబడుల ప్రవాహం

- కార్యకలాపాలను రెట్టింపు చేయనున్న పెప్సికో
- రూ.750 కోట్లతో అలాక్స్ నుంచి బ్యాటరీల తయారీ కేంద్రం
- అపోలో టైర్స్ నుంచి డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్
- మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పందాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు వేదికగా తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. భారీ పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకు వస్తున్నాయి. తెలంగాణలో నెలకొన్న సానుకూల వాతావరణాన్ని సంస్థలు అందిపుచుకోవడంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. తాజాగా తెలంగాణలో తన కార్యకలాపాలను రెట్టింపు చేయనున్నట్లు అంతర్జాతీయ దిగ్గజ సంస్థ పెప్సికో ప్రకటించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో మంత్రి కే తారక రామారావుతో జరిగిన సమావేశంలో పెప్సికో సంస్థ ప్రతినిధులు ఈ మేరకు తెలియచేశారు. హైదరాబాద్ కేంద్రంగా పెప్సీకో నిర్వహిస్తున్న గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ సెంటర్ ను మరింతగా విస్తరించి కార్యకలాపాలను రెట్టింపు చేస్తామన్నారు. కేవలం 250 మందితో 2019లో ప్రారంభమైన గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ సెంటర్ లో ఇపుడు 2800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్న పెప్సికో, ఈ సంఖ్యను నాలుగువేలకు పెంచబోతున్నట్లు తెలిపింది. సంవత్సర కాలంలో అదనపు ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు సంస్థ కార్యకలాపాలను భారీగా విస్తరిస్తామంది. ఇందుకు సంబంధించిన పెట్టుబడి గణాంకాలను త్వరలోనే ప్రకటిస్తామంది. దావోస్ లోని తెలంగాణ పెవిలియన్ లో జరిగిన సమావేశంలో పెప్సికో విస్తరణ ప్రణాళికలపై ఆ సంస్థ కార్పొరేట్ కార్యకలాపాల కార్యనిర్వాక ఉపాధ్యక్షుడు రాబర్టో అజేవేడో, మంత్రి కేటీఆర్ తో చర్చించారు. ఈ పరిణామంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ఎంతో పేరున్న పెప్సీకో విస్తరణ ప్రణాళికలకు అవసరమైన సహాయ సహకారాలను తెలంగాణ ప్రభుత్వం తరపున అందిస్తామన్నారు. తెలంగాణలో ఉన్న పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఇతర విభాగాలు, రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని పెప్సికో ప్రతినిధి బృందానికి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. మల్టీ గిగా వాట్ లిథియం క్యాథోడ్ మెటీరి యల్ తయారీ కేంద్రం తెలంగాణలో ఏర్పాటుకానుంది. బ్యాటరీల తయారీలో అంతర్జాతీయంగా పేరున్న అలాక్స్ అడ్వాన్స్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని నెలకొల్పుతుంది. లిథియం ఐరన్ ఫాస్ఫేట్ యాక్టివ్ బ్యాటరీలు ఈ తయారీ కేంద్రంలో ఉత్పత్తి అవుతాయి. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో మంత్రి కే.తారకరామారావు సమక్షంలో అలాక్స్ ప్రతి నిధులు తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో తొలుత రూ.210 కోట్ల పెట్టుబడితో మూడు గిగా వాట్ల సామర్థ్యంతో లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీలను ఉత్పత్తి చేస్తామని అలాక్స్ తెలిపింది. ఈ సామర్థ్యాన్ని భవిష్యత్తులో 10 గిగావాట్లకు పెంచుతామంది. 2030 సంవత్సరం నాటికి మొత్తంగా రూ.750 కోట్ల ఈ కేంద్రం పై పెట్టుబడిగా పెడతామంది. ప్రతిపాదిత తయారీ కేంద్రంతో సుమారు 600 మంది అత్యుత్తమ నైపుణ్యం కలిగిన నిపుణులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని అలాక్స్ తెలిపింది. కేటీఆర్ మాట్లాడుతూ... ఎలక్ట్రిక్ వాహనాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు రాష్ట్రంలో తయారీ ఈకో సిస్టంను పెంచేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు అపోలో టైర్స్ లిమిటెడ్ ప్రకటించింది. లండన్ తరువాత తమ రెండవ డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపింది. నాలుగో పారిశ్రామిక విప్లవంలో భాగంగా కంపెనీ డిజిటల్ వ్యూహాలైన ఐటీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, బ్లాక్ చైన్ వంటి వినూత్న సాంకేతికతలను ఉపయోగించుకుని, కొత్త వ్యాపార నమూనాలను అభివృద్ధి చేయడం, వినియోగదారులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో ఈ డిజిటల్ ఇన్నోవేషన్ కేంద్రం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ మేరకు మంత్రి కే.తారకరామారావు సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం తరుపున ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, అపోలో టైర్స్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీ నీరజ్ కన్వర్ ఒప్పందం కుదుర్చుకున్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని ఆల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ డిమాండ్ చేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది టెలికాం అండ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని సీజీఎం టెలికాం కార్యాలయం ప్రాంగణంలో విశ్రాంత ఉద్యోగులు (పెన్షనర్లు) ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేది నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉండగా 5ఏళ్లు దాటినా కూడా పెన్షన్ రివిజన్ జరగకపోవటం దురదృష్టకరం అన్నారు. అన్ని విషయాల్లో తమనకు సెంట్రల్ గవర్నమెంట్ పెన్షనర్లుగా పరిగణిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లుకు 2017 జనవరి ఒకటవ తేది నుంచి పెన్షన్ రివిజన్ జరిగిందని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు మాత్రం పెన్షన్ రివిజన్ జరగలేదని తెలిపారు. 7వ సీపీసీ ప్రకారం కూడా తమకు పెన్షన్ రివిజన్ చేయాలని కోరారు. ఈ ధర్నాలో ఆల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, రిటైర్డు ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ అడ్వైజర్ ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, కార్యదర్శి భాస్కరరావు, ఎగ్జిక్యూటీవ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యదర్శి కోటేశ్వరరావు, కేశవరావు, శివరామకుమార్, ఎన్ఎఫ్‌టీఈ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు పాల్గొన్ని మద్దతు ప్రకటించారు.

బీజేపీ అధ్యక్షుడిగా మరో ఏడాది నడ్డా

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ అని ఆయనన్నారు. నడ్డా ఆయన నాయకత్వంలో అనేక రాష్ట్రాల్లో కమలం వికసించిందని, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 120కుగాను 73 స్థానాలను గెలుచుకున్నదని చెప్పారు. బీహార్‌లో, మహారాష్ట్రలో విజేతగా నిలిచిందన్నారు. హరియాణా, యూపీ, ఉత్తరాఖండ్, అసోం, మణిపూర్, గోవా, గుజరాత్‌లో తిరిగి అధికారంలోకి రాగలిగిందని తెలిపారు. నరేంద్రమోదీ ఛరిష్మాను ఓట్లగా మల్చడంలో నడ్డా నాయకత్వం కీలకమని అమిత్‌షా వ్యాఖ్యానించారు.

సీపీఐ పోరుబాట

(మొదటిపేజీ తరువాయి)

ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వంలో స్పందనలేకుంటే ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర రాజధాని విజయవాడ నగరంలో మహా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మహాధర్నా కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీ నాయకులను ఆహ్వానిస్తామన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ముసునూరు సుహాస్, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, పెదవడ్లపూడి శాఖ కార్యదర్శి జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, గజవల్లి వెంకట కృష్ణారావు, నాగళ్ల వెంకట్రావు, షేక్ కరిముల్లా, సింహాద్రి అప్పన్న, యార్లగడ్డ శివయ్య, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యయం పెంచాల్సిందే: కేవీవీ ప్రసాద్

జగనన్న కాలనీలోని ఇళ్లను రూ.5లక్షలతో నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం చిన్నఓగిరాల గ్రామంలో జగనన్న కాలనీ పేరుతో దాదాపు 350 మందికిపైగా లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలను సీపీఐ బృందం మంగళవారం పరిశీలించింది.

ఈ బృందంలో కేవీవీ ప్రసాద్‌తోపాటు సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాతయ్య, చిన ఓగిరాల సర్పంచ్ వైవీ కుటుంబరావు, సీపీఐ నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొని లబ్ధిదారుల సమస్యల్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ 9.5ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 350 మందికి పట్టాలు మంజూరు చేశారని, కాని ఆ గ్రామానికి కిలోమీటరు దూరంలో ఇళ్ల స్థలాలు కేటాయించడం వల్ల లబ్ధిదారులకు ప్రాథమిక, రవాణా సౌకర్యాలు లేవన్నారు. ఆ భూములు లోతట్టు ప్రాంతం కావడంతో కొద్దిపాటి వర్షానికే బురదమయంగా ఉంటోందన్నారు. దానిని మెరక చేసేం దుకే అధిక భారమవుతుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని, ఆ గ్రామ సర్పంచ్ కుటుంబరావు సీపీఐ నాయకత్వం దృష్టికి తీసుకొచ్చారు.

మౌలిక సౌకర్యాలు మృగ్యం: దేగా ప్రభాకర్

జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాల్లేవని, లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దేగా ప్రభాకర్ పేర్కొన్నారు. ఏలూరు కార్పొరేషన్ 26వ డివిజన్ లో జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణం స్వాధీనం చేయాలని జగనన్న కాలనీల లబ్ధిదారుల వద్ద నుండి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఎంఏ హకీం, తెర్లాపు శ్రీను, ఎ లక్ష్మీ ఇందిర,మావూరి విజయ, జగనన్న లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒక్క కాలనీలోనూ ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు: జంగాల అజయ్‌కుమార్

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు లాం ప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను సీపీఐ బృందం మంగళవారం సాయంత్రం పరిశీలించి లబ్ధిదారుల నుంచి సంతకాలు సేకరించింది. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏ కాలనీలో కూడా పట్టుమని నాలుగు ఇళ్లు పూర్తి కానీ దృశ్యాలు కనబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలులో పి.నాగాంజనేయులు, తాడికొండలో ముప్పాళ్ల శివశంకరరావు, వినుకొండలో మారుతీవరప్రసాద్, పొన్నూరులో పుప్పాల సత్యనారాయణలు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యయం పెంచకపోతే ఆందోళన ఉధృతం: జగదీష్

పేదలకు కేటాయించిన జగనన్న ఇంటి నిర్మాణ వ్యయం ఐదు లక్షలకు పెంచకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు డి.జగదీష్ హెచ్చరించారు. జగనన్న లబ్ధిదారులతో సంతకాల సేకరణ కార్యక్రమం అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలోని బెంచి కొట్టాల ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే లక్షా ఎనభై వేల రూపాయలు ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రభుత్వం తక్షణమే నిర్మాణ వ్యయం పెంపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గోపి, మండల కార్యదర్శి రాము రాయల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు దేవేంద్ర, రామాంజనేయులు , ఈశ్వరయ్య, అడ్వకేట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం అయ్యాక మాట మార్చారు: రామచంద్రయ్య

జగనన్న ఇంటి నిర్మాణానికి 5లక్షల రూపాయలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని చదువుల రామయ్య భవనంలో మహాధర్నా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, కారుమంచి, కారన్న, పెద్ద ఈరన్న, సురేంద్ర కుమార్, నెట్టికంటయ్య, మాదన్న, నాగరాజు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో

గోస్పాడు మండలం శ్రీనివాసపురం గ్రామంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్ జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారులతో సంతకాలు సేకరించి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల సీపీఐ కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి గోకారి, ఎఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో

సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పర్యటించి జగనన్న ఇళ్ల లబ్ధిదారులను కల్సి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉప్పె నర్సింహారావు, ఇస్లావత సాంబయ్య, భూక్యా దేశ్య, లక్ష్మీనారాయణ,కంపా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. గంపలగూడెంలో తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో

ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు జరిగే సీపీఐ పోరుబాటలో భాగంగా మంగళవారం జగనన్న లబ్ధిదారులతో ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ గౌడ్, మండల కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలోకి పోలీసులు

- ఖాళీ చేయాలని హుకుం
- గొల్లపూడిలో ఉద్రిక్తత
- టీడీపీ శ్రేణుల ఆందోళన
- వైసీపీ నాయకుల కుట్ర: దేవినేని ఉమ

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): విజయవాడ గొల్లపూడిలోని టీడీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. జనవరి 18న టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నందమూరి తారకరామారావు వర్ధంతిని నిర్వహించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తుండగా, అక్కడికి వచ్చిన పోలీసులు... కార్యాలయ గేట్లకు తాళాలు వేసేందుకు ప్రయత్నించారు. ఈ చర్యను టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రతిఘటించడంతో పార్టీ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పునరుద్ధరించిన టీడీపీ గొల్లపూడి గ్రామ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభించి, ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించేం దుకు అలాగే మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించేందుకు పార్టీ నేతలు సన్నాహలు చేశారు. ఈ క్రమంలో అక స్మాత్తుగా అక్కడకు చేరుకున్న పోలీసులు... పార్టీ కార్యాలయం ప్రైవేట్ వ్యక్తులకు చెందినది కాబట్టి పార్టీ నేతలు, కార్యకర్తలను ఖాళీ చేయించాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు టీడీపీ కార్యాలయాన్ని ప్రైవేట్ స్థలం నుంచి ఖాళీ చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమా మహేశ్వరరావు, ఇతర నేతలు పార్టీ కార్యాలయానికి చేరుకుని పార్టీ కార్యాలయం గేటు ముందు బైఠాయించారు. పార్టీ కార్యాలయ ఆవరణలోకి అనుమతించకుండా, తాళం వేయడాన్ని వ్యతిరేకించారు. కొంతమంది టీడీపీ నేతలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరుకుని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు విజయవాడ వెస్ట్‌జోన్ ఏసీపీ డాక్టర్ కె.హనుమంతరావు, ఇతర పోలీసు అధికారులు వారిని పార్టీ కార్యాలయం నుంచి బయటకు పంపించేందుకు ప్రయత్నించారు. అయితే వీరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో విజయవాడ నుంచి గొల్లపూడికి అదనపు బలగాలను రప్పించారు. అయితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పార్టీ కార్యాలయ గేట్లకు పోలీసులు ఎలా తాళం వేస్తారని దేవినేని ఉమ అధికారులను ప్రశ్నించారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు పార్టీ నేతలు, కార్యకర్తలను పార్టీ కార్యాలయం నుంచి చెదరగొట్టారు. అనంతరం ఏసీపీ హనుమంతరావు, దేవినేని ఉమతో చర్చించగా పార్టీ కార్యాలయానికి తాళం వేసేందుకు నిరాకరించారు. కార్యాలయ స్థలం టీడీపీ మద్దతుదారు ఆలూరి చిన్నాకు చెందినదని పార్టీ వర్గాలు చెబు తున్నాయి. గత కొన్నేళ్లుగా ఇదే స్థలంలో టీడీపీ కార్యాలయం కొనసాగుతోందని సమాచారం. మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారని, చిన్నా కుటుంబ సభ్యుల మధ్య ఉన్న తగాదాను ఉపయో గించుకుని పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేయించేందుకు అధికార వైఎస్సార్‌సీపీ నేతలు కుట్ర పన్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ తహసిల్దార్ గొల్లపూడి వెళ్లి టీడీపీ నేతలతో చర్చలు జరిపారు. గొల్లపూడిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పార్టీ కార్యాలయం వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయంపై వివరాలు కోరిన ప్రభుత్వం

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కరోనాతో మరణించిన ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం అందించిన వివరాలను తెలపాలని తన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం డీఈవోలకు ఉత్తర్వులు జారీజేసిందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...కరోనాతో మరణించిన ఉపాధ్యాయుల్లో ఎంతమందికి ఆర్థిక సహాయం అందిందనే విషయంపై తాను గతంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు గుర్తుచేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏప్రిల్-2021 నుంచి జులై-2021 వరకు రెండో విడత కరోనాతో మరణించిన ఉపాధ్యాయుల సంఖ్య, వారిలో ఎంత మందికి ప్రభుత్వ సహకారం అందించిన వివరాలు పంపాలంటూ డీఈవోలను ఆదేశించిందని కత్తి నరసింహారెడ్డి తెలిపారు.

విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న జగన్

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుబ్బారావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ భవిష్యత్తుకు ప్రమాణికం అయిన విద్యా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం స్వార్థపూరితంగా వ్యవహరిస్తూ విచ్ఛిన్నం చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్రంలో విద్యా వ్యవస్థ చూస్తుంటే పాలకుల స్వార్థానికి అద్దం పడుతోందన్నారు. నాణ్యమైన విద్య అందిస్తానంటూ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు నీటి మూటలుగా మిగిలాయనీ, జగన్ ఇచ్చిన హామీలు మోసపూరితంగా మారాయని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ నిలువునా మోసగించారన్నారు. ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానని వాగ్దానం చేసిన జగన్ నేటికీ ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా దగా చేశారని, రాష్ట్రంలో దాదాపు 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందంటూ కేంద్రం నివేదించిందని గుర్తుచేశారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తానంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ మూడున్నరేళ్లల్లో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేపట్టలేదన్నారు. పైపెచ్చు ఉన్న ఉపాధ్యాయులను చాలా రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉపాధ్యాయ పదోన్నతులు నిలిపివేసి అనధికారికంగా ఎస్జీటీలను స్కూలు అసిస్టెంట్లుగా నియమించి అటు డీఎస్సీ నిరుద్యోగులుకు, ఇటు పదోన్నతి పొందే ఉపాధ్యాయులు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారన్నారు. మాతృభాష అయిన తెలుగు ప్రాధాన్యత తగ్గించి ఆంగ్లానికి పెద్దపీట వేస్తూ మరో మోసానికి పాల్పడ్డారని, ఉపాధ్యాయులు నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులు కాకుండా విద్యార్థులను కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. పాఠశాలల అభివృద్ధి పేరుతో వైసీపీ నేతల జేబులు నింపుకుంటూ, విద్యా వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే డీఎస్సీ పోస్టుల భర్తీకి సీఎం జగన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ ప్రాంతాల్లో పీఎస్పీలు వద్దు

- స్థానికుల జీవనావసరాలకు భంగం కలిగించొద్దు
- ప్రైవేటు సంస్థలకిచ్చిన అనుమతులు ఉపసంహరించుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి మానవహక్కుల ఫోరం డిమాండ్

విజయవాడ: రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాల్లో జలవిద్యుత్ ప్రాజెక్టులను చేపట్టడం ద్వారా స్థానికుల జీవనావసరాలకు భంగం కలిగించవద్దని, ఇటువంటి చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మానవహక్కుల ఫోరం డిమాండ్ చేసింది. విశాఖపట్నం, పర్వతీపురం-మన్యం జిల్లాల్లో ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో వేర్వేరు ప్రైవేటు సంస్థలకు జలవిద్యుత్ ప్రాజెక్టులు (పీఎస్పీ)కు అనుమతులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేయడాన్ని మానవహక్కుల రాష్ట్ర ఫోరం (హెచ్ఆర్ఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఇచ్చిన అనుమతులను ఉపసంహరించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజేశ్, హెచ్ఆర్ఎఫ్, ఏపీ & టీఎస్ సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో నాలుగు పీఎస్పీలు ఉనన్నాయని, అవి... అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతపల్లిలోని యర్రవరం పీఎస్పీ, కొయ్యూరు మండలాలు, పెదకోట పీఎస్పీ (అనంతగిరి మండలం), పర్వాతీపురం-మన్యం జిల్లాలోని పాచిపెంట మండలంలోని కర్రివలస, సాలూరు మండలంలోని కురుకుట్టి పీఎస్పీలుగా తెలిపారు. వీటికి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభించినట్లు హెచ్ఆర్ఎఫ్ ప్రకటన పేర్కొంది. కురుకుట్టి, కర్రివలస, పెదకోటలో పీఎస్పీల ఏర్పాటుకు అదానీ కంపెనీకి అనుమతివ్వగా, యర్రవరం ప్రాజెక్టును షిరిడి సాయి ఎలక్ట్రికల్స్‌కు ప్రభుత్వం అప్పగించినట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్టుల నోడల్ ఏజెన్సీగా నూతనంగా ఏర్పాటైన కొత్త-పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధి ఏపీ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ఉన్నదని, ప్రతి ప్రాజెక్టు సామర్థ్యం వెయ్యి మెగావాట్లని ఫోరం పేర్కొంది. నాలుగు సైట్లను సందర్శించి స్థానిక అదివాసీలతో మాట్లాడగా విస్తుపోయే విషయాలు వెలుగుచూసినట్లు తెలిపింది. చట్టాన్ని ధిక్కరిస్తూ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ ప్రాజెక్టులు సాగుతున్న విధానం షాక్‌కు గురిచేసినట్లు హెచ్ఆర్ఎఫ్ తెలిపింది. పంచాయతీ (ఎస్టీ ప్రాంతాల విస్తరణ) చట్టం (పెసా), ఎఫ్ఆర్ఏ చట్టాల ఉల్లంఘన జరుగుతోందని పేర్కొంది. షెడ్యూల్ ప్రాంతాల్లో భూముల లీజు వ్యవహారాలను ఏపీ లాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ (ఎల్టీఆర్) చూసుకుంటుందని, 1997 నాటి సమత కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల్లో ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రైవేటు కంపెనీలకు అనుమతిలేదని హక్కుల ఫోరం గుర్తుచేసింది. ఈ తీర్పుకు విరుద్ధంగా ప్రస్తుతం పనులు జరుగుతున్నట్లు తెలిపింది. గిరిజన సలహా మండలి (టీఏసీ)లో ఈ ప్రాజెక్టుల గురించి ముందస్తుగా సంప్రదింపులను, చర్చలను ప్రభుత్వం జరపలేదని, తప్పనిసరైనాగానీ వీటిని పట్టించుకోలేదని హక్కుల ఫోరం పేర్కొంది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఆదివాసీలు ఈ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపింది. తమ జీవనోపాధికి, మనుగడకు ఇవి ప్రమాదకరమని వారు వాపోతున్నట్లు వెల్లడించింది. ప్రతీ పీఎస్పీకి సంబంధించి అప్పర్-లోయర్ రిజర్వాయర్ అవసరాల క్రమంలో చాలా భూమి కావల్సి ఉంటుందని ఫోరం పేర్కొంది. ఈ ప్రాజెక్టులు స్థానిక వనరుల నుంచి నీటిని తోడేస్తాయని తద్వారా ఆదివాసీల మనుగడే ప్రశ్నార్థకమవుతుందని, వారి నిత్య అవసరాలు, సాగుకు సరిపడ నీటివనరులు ఉండవని ఫోరం ఆందోళన వ్యక్తంచేసింది. యర్రవరం పీఎస్పీకి దంతావా రిజర్వాయర్, పెదకోట పీఎస్పీకి రాయ్‌వాడ రిజర్వాయర్, పార్వతీపురం-మన్యం జిల్లా పీఎస్పీలకు సువర్ణముఖి నది నుంచి నీళ్లు పొందే వెంగళరాయసాగర్ రిజర్వాయర్ జలవనరులుగా మారుతాయని తెలిపింది. తద్వారా స్థానిక ఆదివాసీలకు, రైతులకు సరిపడ నీరు అందుబాటులో ఉండదని పేర్కొంది. ఆదివాసీల జీవనహక్కును హరించేలా షిరిడి సాయి ఎలక్ట్రికల్స్, అదానీ ఎనర్జీకి అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిందని తెలిపింది. ఈ కారణాలతో వేలాది మంది వలసబాట పట్టక తప్పని పరిస్థితి నెలకొన్నదని పేర్కొంది. ఈ విధంగా ఆదివాసీల జీవికహక్కును హరించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆయా ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మానవహక్కుల ఫోరం డిమాండ్ చేసింది.

అరసం రాష్ట్ర మహాసభలకు రూ. 2 లక్షల విరాళం

విశాలాంధ్ర, తెనాలి: అరసరం రాష్ట్ర మహాసభలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 11, 12 తేదీలలో 80 సంవత్సరాల తరువాత తెనాలిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలను జయప్రదంగా నిర్వహిం చేందుకు ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్. వడ్లమూడి రూ. 2 లక్షల విరాళాన్ని అందించారు. స్థానిక ముత్తెం శెట్టివారి పాలెంలోని తన స్వగృహంలో మంగళ వారం అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగాకు రూ. 2 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా పెను గొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డాక్టర్ బాబు ఆర్థిక చేయూతతో తమలో నూతన ఉత్సాహాన్ని నింపారన్నారు. ఈ మహాసభల్లో అరసం జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొని తెలుగు సాహి త్యం దశ, దిశ, తెలుగు భాష గమనం- గమ్యం, ప్రగతిశీల సాహిత్య, సాంస్కృతిక శక్తులపై దాడు లు- కర్తవ్యాలు ఇత్యాది అంశాలపై ప్రసం గిస్తారని పెనుగొండ తెలిపారు. వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ మహాసభలను పురస్కరిం చుకుని ఈ నెల 21, 22 తేదీలలో తాలూకా జూనియర్ కళాశాలలో పాఠశాల, కళాశాల విద్యా ర్థులకు నిర్వహిస్తున్న కథచెప్పండి, వ్యాసరచన, వక్తృత్వం, పోటీలలో బాలబాలికలు పెద్ద సంఖ్య లో పాల్గొనాలని, వివరాలకు 9177174389, 7729971471 నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జాని తదితరులు పాల్గొనారు.

ఆర్టీసీకి లాభాల పండుగ

సంక్రాంతికి రూ.7.90కోట్ల ఆదాయం

తిరుగు ప్రయాణానికీ ప్రత్యేక బస్సులు

-ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కి లాభాల పండుగ లభించింది. సంక్రాంతికి ఆర్టీసీ నడిపిన ప్రత్యేక బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 6 నుంచి 14 వరకు ఆర్టీసీ రికార్డు స్థాయిలో 3,392 ప్రత్యేక బస్సులు నడిపింది. ఈ సంవత్సరం సంక్రాంతికి 50శాతం అదనపు చార్జీలు లేకుండానే అదనంగా ప్రత్యేక బస్సులకుగాను రూ.7.90 కోట్ల ఆదాయాన్ని సంస్థ ఆర్జించింది. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మంగళవారం ఆదాయ వివరాల్ని వెల్లడించారు. గతేడాది సంక్రాంతికి ప్రత్యేక బస్సులకు రూ.7.17కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.7.90కోట్లు లభించింది. గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.73 లక్షల ఆదాయం సంస్థ సాధించింది. వాటితోపాటు రెగ్యులర్ సర్వీసులకు గతేడాది సంక్రాంతికి రూ.107 కోట్లు రాగతా, ఈ సంక్రాంతికి రూ.141 కోట్ల ఆదాయం లభించింది. సంక్రాంతి ముందు రోజుల్లోను, పండుగ పూర్తయ్యాక సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సుల ఏర్పాటుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. తిరుగు ప్రయాణ టిక్కెట్ చార్జీపై 10శాతం రాయితీ సౌకర్యమూ ప్రయాణికులను కల్పించి, ఆర్టీసీ వైపు ఆకర్షించేలా చేసింది. గత సంక్రాంతికి 2,400 ప్రత్యేక బస్సులను మాత్రమే నడపగా, ఈ విడత వాటి సంఖ్యను కల్పించింది. గతేడాది హైదరాబాదు నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 824 బస్సులు నడపగా, ఈ సంవత్సరం 1,483 ప్రత్యేక బస్సులను నడిపింది. హైదరాబాద్‌లో సరైన మౌలిక సదుపాయాలు లేనప్పటికీ పెద్ద ఎత్తున బస్సులు నడిపి, ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ప్రత్యేక సర్వీసులను కొనసాగించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర అంతఃరాష్ట్రాలకు వెళ్లే తిరుగు ప్రయాణికుల కోసం రద్దీని బట్టి ముందస్తు సీట్ల రిజర్వేషన్ కల్పించింది. బస్సులు నిరంతరం అందుబాటులో ఉంచింది. సంక్రాంతి ముందు రోజుల్లో ఏపీఎస్ ఆర్టీసీ సేవలను విశేషంగా ఆదరించినందుకు ప్రయాణికులందరికీ ఎండీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రదేశాల నుంచి తగిన సంఖ్యలో తిరుగు ప్రయాణం కోసం ఏపీఎస్ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసిందన్నారు. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు ఆదరించి, సేవలు పొందాలని కోరారు.

కేటీఆర్‌కు అరుదైన గుర్తింపు

సోషల్ మీడియా ప్రభావశీలుర జాబితాలో చోటు

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మరో ఘనత సాధించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభావితం చేసే వారి జాబితాలో చోటు సంపాదించారు. ప్రపంచ వ్యాప్తంగా మొదటి 30 మంది జాబితాలో మంత్రి కేటీఆర్‌కు స్థానం దక్కింది. భారత దేశం నుంచి ఇద్దరు యువనేతలు మాత్రమే ఈ జాబితాలో ఉన్నారు. అందులో ఒకరు మంత్రి కేటీఆర్ కాగా మరొకరు ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా. ఇద్దరిలోనూ మంత్రి కేటీఆర్ ముందంజలో ఉన్నారు. ఐటీ శాఖ మంత్రిగా తెలంగాణ ఐటీ పురోభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమాల్లోనూ చురుగ్గా ఉంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. అటు అధికారిక, ఇటు వ్యక్తిగత రెండు ఖాతాల్లోనూ మంత్రి కేటీఆర్ అగ్రస్థానంలో నిలిచారు.

వేముల రోహిత్ బలిదానం సామాజికోద్యమాలకు స్ఫూర్తి

కరవది సుబ్బారావు

విశాలాంధ్ర-విజయవాడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి వేముల రోహిత్ బలిదానం సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి కావాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. వేముల రోహిత్ 10వ వర్ధంతి సందర్భంగా మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న అంబేద్కర్ విగ్రహం దగ్గర డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కరవది సుబ్బారావు మాట్లాడుతూ నాటి ప్రభుత్వ పెద్దలు, కేంద్రమంత్రులు, యూనివర్సిటీ అధ్యాపకుల నిరాదరణ, కుట్రలకు గురైన రోహిత్ వెలివాడను నిర్వహించి యువతను చైతన్యపర్చటానికి, వివక్షను నివారించటానికి పరితపించారని, చివరకు ప్రాణాలను త్యజించారన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లా డుతూ విద్యాలయాల్లో కుల, మతవివక్షను పెంచిపోషిస్తున్న పాలకుల దుర్మార్గపు చర్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం దళిత ప్రజా సంఘాలు ఐక్య కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప, విజయవాడ నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య, మత్స్యకార సంఘ నేత తాడి పైడియ్య, డీహెచ్‌పీఎస్ నాయకులు పగిడికత్తుల రాము, ప్రత్తిపాటి రాజు, కాళ్ల విజయ్, ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర కార్యదర్శి ఎం. సాయికుమార్, పాశం ఆంజనేయులు, దళిత ప్రజాసంఘాల నాయకులు నాగేంద్ర, జి.నటరాజ్, గణేశ్, పరిశపోగు రాజేశ్, వరప్రసాద్, చింతల శ్రీనివాస్, కె.మోజెస్, నర్సింహారావు, రూబెన్ పాల్గొన్నారు.

దావోస్ సదస్సుకు ఆహ్వానం లేదనడం అవాస్తవం

పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆహ్వానం అందలేదంటూ టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దావోస్ సదస్సులో పాల్గొనాలంటూ నవంబర్ 25వ తేదీనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఆహ్వానం అందిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన లేఖ ప్రతిని మీడియా ముందుంచారు. గత ఏడాది దావోస్ సదస్సుకు హాజరైన సీఎం జగన్... రాష్ట్రంలో వైద్య రంగంలో తీసుకువస్తున్న సంస్కరణల గురించి ప్రపంచ దేశాలకు తెలిసేలా చేశారని అమర్నాథ్ చెప్పారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్, గ్రీన్ ఎనర్జీ గురించి కూడా ముఖ్యమంత్రి వివరించిన తీరును ప్రపంచ దేశాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు అభినందిం చారన్నారు. ఈ ఏడాది మార్చిలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజాలను ఆహ్వానిం చాలన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి ఉన్నారని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిన నేపథ్యంలోనే దావోస్ సదస్సుకు వెళ్లలేదని మంత్రి అమర్‌నాథ్ స్పష్టం చేశారు. దావోస్ వెళ్లి తాను చాలా ఘనత సాధించానని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడును ఆ సదస్సులో మాట్లాడమని నిర్వాహకులు ఎప్పుడైనా ఆహ్వానించారా? అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై లోకేశ్ శ్వేత పత్రం కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు తన హయాంలో ఏడాదికి 11 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు మాత్రమే తీసుకువచ్చారని, కరోనా పరిస్థితులను కూడా తట్టుకొని జగన్మోహన్ రెడ్డి సంవత్సరానికి 15 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువస్తున్నారని ఆయన వివరించారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ వారాహి వాహనాన్ని ప్రారంభిస్తున్న విషయమై విలేకరులు మంత్రిని ప్రశ్నించగా ఆ వాహనంపై నుంచి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రచారాలు ప్రారంభిస్తే మంచిదని సలహా ఇచ్చారు.

విద్యుత్ చార్జీలపై
19 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

మూడ్రోజులు వర్చువల్‌గా నిర్వహణ: ఏపీఈఆర్సీ చైర్మన్

విశాలాంధ్ర బ్యూరో -విశాఖపట్నం: విద్యుత్తు చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 19 నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) సేకరించనుంది. ఇందుకోసం పకడ్బం దీగా ఏర్పాట్లు చేసినట్లు ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. విద్యుత్తు పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీ ఎల్ అధికారులు విశాఖపట్నం నుంచే ఈ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు ఆయన చెప్పారు. ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నమూనా ప్రజాభిప్రాయ సేకరణ (మాక్ డ్రిల్) కార్యక్రమం సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడారు. 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిస్కమ్‌ల సీఎండీలకు సూచించారు.

ఎక్కువ మంది పాల్గొనేలా సిబ్బందితో ప్రచారం చేయించాలన్నారు. సర్కిల్, డివిజన్ కార్యాలయాల నుంచి తమ సలహాలు/ సూచనలు/ అభ్యంతరాలను వినియోగదారులు తెలిపేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గత రెండేళ్లలానే ఈ ఏడాదీ రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాలోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం(ఎస్ఈ ఆఫీస్) లేదా డివిజన్ కార్యాలయాల (ఈఈ ఆఫీస్) నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాలను తెలుపవచ్చున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్నిhttps:// ncubestreamings.com/apercpublichearing వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. నమూనా ప్రజాభిప్రాయ సేకం`ణలో నాగార్జునరెడ్డితో పాటు సభ్యులు ఠాకూర్ రాంసింగ్, కార్యదర్శికె. రాజబాపయ్య, సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మ జనార్దన్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోశ్‌రావు, విద్యుత్ పంపిణీ సంస్థల ముగ్గురు డైరెక్టర్లు, సూపరింటెండెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుపై చర్చకు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వంలో దళిత సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు తీరుపై ఏ దళితమంత్రైనా బహిరంగ చర్చకు రాగలరా? అని టీడీపీ నేత నక్కా ఆనంద్‌బాబు ప్రశ్నించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితులకు జగన్ చేస్తున్న వంచన, ద్రోహాన్ని కప్పి పుచ్చడానికే సబ్ ప్లాన్ నిధులు-సాటిలేని ఉపకారవేతనాల పేరుతో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. 29 రిజర్వు నియోజక వర్గాలుంటే, 27 స్థానాల్లో వైసీపీ వారే గెలిచారనీ, వారిలో ఐదుగురు దళిత మంత్రులున్నారని పేర్కొన్నారు. వారెవరైనా సరే నాతో సబ్ ప్లాన్ నిధుల అమలు తీరుపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులకు అమలుచేసిన 27పథకాలు రద్దు చేయడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లించడమేనా జగన్ దళి తులకు చేసిన మేలు? అని నిలదీశారు. 2003లోనే ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఇతర పథకాలకు మళ్లించడానికి వీల్లేదని హైకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వం దళితులకు అమలుచేసిన 27 సంక్షేమ పథకాల్ని జగన్ రాగానే రద్దుచేశారన్నారు. ప్రతి ఆర్నెల్లకోసారి దళిత పథకాల అమలుపై చంద్రబాబు సమీక్షించేవారన్నారు. సబ్‌ప్లాన్ నిధుల్లో రూ.4,900కోట్లతో దళితవాడల్లో ఆరు వేల కిలోమీటర్ల సీసీరోడ్లు వేశామని, డ్రైనేజీల నిర్మాణంతోపాటు, తాగునీటి సమస్య లేకుండా రక్షిత మంచినీటి నిర్మాణానికి కృషి చేశామని వివరించారు. మూడున్నరేళ్లలో కేంద్రం నుంచి సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి ఎస్సీ, ఎస్టీల ఉపకార వేతనాలకు రూ.4,500కోట్లు వచ్చాయని, దానిలో రూ.2,000కోట్లు సబ్ ప్లాన్ కింద వాడాల్సి ఉండగా, వాటిని జగన్ ప్రభుత్వం దారిమళ్లించిందని మండిపడ్డారు.

ఏనుగు దాడి... రైతు మృతి

విశాలాంధ్ర-భామిని: విజయనగరం జిల్లా భామిని మండలం ఘనసార, కీసర, కొసలి, తాలాడ గ్రామాలలో ఏనుగుల గుంపు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాలాడ గ్రామానికి చెందిన రైతు గోపిశెట్టి చిన్నారావు (53) ఏనుగుల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని కల్లంలో ధాన్యం కుప్పను చూడటానికి వెళ్లగా అకస్మాత్తుగా ఓ ఏనుగు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నారావు ని కుటుంబ సభ్యులు కొత్తూరు ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం జెమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఏనుగుల గుంపు సంచరిస్తున్న దిశ తెలియకపోవటం వల్లే చిన్నారావు రాత్రివేళ పొలంలోకి వెళ్లాడని, అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం బలైపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

రైతుల రాస్తారోకో: రాష్ట్ర ప్రభుత్వం, అటవీ అధికారుల నిర్లక్ష్య వల్లే ఏనుగు దాడిలో రైతు మృతి చెందాడంటూ తాలాడ, ఘనసార, కీసర, కొసలి గ్రామస్తులు, రైతులు ఏ.బి రహదారి పై ఆందోళనకు దిగారు. రైతు సంఘం నాయకుడు కొప్పర మిన్నరావు అధ్వర్యంలో రాస్తారోకో చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలు ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసమైన రైతులకు ఎకరాకు రూ.30వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల రాస్తారోకో పై స్పందించిన తహసీల్దార్ ఎన్.అప్పారావు, సీఐ మురళీధర్, ఎఫ్ఆర్ఓ తవిటి నాయుడు నిరసన చేపట్టిన రైతులతో మాట్లాడి ఏనుగుల తరలింపు పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జి మోహనరావు, ఘనసర మాజీ ఎంపీపీ ఆనందరావు, సర్పంచులు కిల్లారి పాల్గుణ, సీపీఎం మండల కన్వీనర్ జి.జగన్ నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సర్వం మోదీ మయం

ఏ ఎన్నికలు లేని సందర్భంలో సోమవారం ప్రధానమంత్రి మోదీ దిల్లీలో రోడ్ షో నిర్వహించడం విచిత్రంగా ఉంది. పటేల్ చౌక్ నుంచి బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగే ఎన్.ఎం.డి.సి. సమావేశం మందిరం దాకా దాదాపు ఒక కిలోమీటర్ మేర ఈ రోడ్‌షో సాగింది. జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగేటప్పుడు ఇలాంటి విన్యాసాలు జరిగిన సందర్భం మరొకటి మాత్రమే ఉందట. ఒరిస్సాలో జాతీయ కార్యవర్గ సమావేశం జరిగినప్పుడు ఇలాగే మోదీ రోడ్ షో నిర్వహించారట. ఈ రోడ్ షోలో మోదీ భద్రతా కట్టుదిట్టాలను కూడా లెక్కచేయకుండా కారు తలుపుతీసి నిలబడి కేరింతలు కొడ్తున్న జనాన్ని చేయి ఊపి ఉత్సాహపరిచారు. ఆయన మీద పూలవాన కురిసింది. సంగీతం హోరెత్తింది. నినాదాలు సరే సరి. రోడ్ షోలు నిర్వహించడం మోదీకి కొత్తకాదు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ ఇలాంటి రోడ్‌షోలు అనేకం నిర్వహించారు. మొన్నటికి మొన్న గుజరాత్ శాసనసభ ఎన్నికలు జరిగినప్పుడు 50 కిలోమీటర్ల పొడవున అహమదాబాద్‌లో రోడ్ షో నిర్వహించారు. సందర్భం లేకుండా దిల్లీలో రోడ్‌షో ఎందుకు నిర్వహించారు అన్న ప్రశ్నకు గుజరాత్ శాసనసభ ఎన్నికలలో విజయం సాధించినందుకు అని కొందరు బీజేపీ నాయకులు అంటున్నారు. మరి హిమాచల్‌ప్రదేశ్‌లో ఓటమికి ఏ పరిహారం చేసుకున్నారో తెలియదు. ఈ రోడ్ షో ద్వారా మోదీ రాజకీయ సందేశం ఏమైనా ఇవ్వదలచుకున్నారా అని ఆలోచిస్తే దిల్లీలో అధికారంలోఉన్న ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు చూశారా మీ ఏలుబడిలోఉన్న దేశ రాజధానిలో ఎంత బ్రహ్మాండమైన రోడ్‌షో నిర్వహించామో చూడండి అని తెలియజెప్పడం ఒక కారణంగా కనిపిస్తోంది. దిల్లీలో రాకపోకలకు జరగవలసినంత ఆటంకం తప్పలేదు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర దిల్లీలో కూడా కొనసాగింది. జనాదరణ కూడా బాగానే ఉంది. మధ్యప్రదేశ్‌లో రాహుల్ పాదయాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. భారత్ జోడో యాత్రను కురచనచేసి చూపించడం కూడా మోదీ ఈ బల ప్రదర్శన ఆంతర్యం కావచ్చు. అంటే పనిలో పనిగా రాహుల్‌కు కూడా ఇవ్వాల్సిన రాజకీయ సందేశం ఇచ్చినట్టున్నారు. భారత్ జోడో బీజేపీకి వెన్నులో ఒణుకు పుట్టిస్తున్నట్టుంది. మోదీ రోడ్డెక్కితే గోదీ మీడియా బోలెడు హడావుడి చేసింది. టీవీ చానళ్లయితే ఈ దృశ్యాలు ప్రత్యక్ష ప్రసారంచేసి తరించి పోయాయి. మేళ తాళాలు, దేశభక్తి గీతాలాపనలు, నినాదాలు షరా మామూలుగా మిన్నంటాయి. హిందుత్వ విధానాలు, విద్వేష ప్రచారాలు బీజేపీకి బాగానే ఓట్లు రాలుస్తున్నాయి. అయితే ఇది అన్నిచోట్లా సాధ్యం కావడంలేదు. భారతీయ జనతాపార్టీ సంస్థాగతంగా చాలా పటిష్ఠమైందనుకుంటారు. కానీ మోదీ ప్రధానమంత్రి అయిన తరవాత పార్టీ ప్రచారంకన్నా మోదీ ప్రచారమే శ్రుతిమించిపోతోంది. ఆయన పలుకుబడి బీజేపీ సంస్థాగత బలాన్ని ఎప్పుడోమించి పోయింది. బీజేపీని నిర్దేశించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)కు కూడా మోదీ విన్యాసాలన్నింటినీ కిమ్మనకుండా భరించవలసి వస్తోంది. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా, లాల్‌కృష్ణ అద్వాణీ ఉప ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కూడా వారు ఆర్.ఎస్.ఎస్. ఆదేశాలను పాటించవలసి వచ్చింది. ఈ ఇద్దరు అగ్రనేతలు గీత దాటుతున్నారనుకున్నప్పుడు ఆర్.ఎస్.ఎస్. అధినేతలు వారిని పిలిపించి మంద్రస్థాయిలోనైనా మందలించేవారు. మోదీ మాత్రం ఆర్.ఎస్.ఎస్. అదుపాజ్ఞల్లో ఉన్నట్టు లేరు. ఉండాలని ఆర్.ఎస్.ఎస్. కూడా కోరుకుంటున్నట్టు లేదు. ఎందుకంటే ఆర్.ఎస్.ఎస్. ఎజెండాను అమలు చేయడానికి మోదీ ఆశించిన దానికన్నా ఎక్కువే చేస్తున్నారు. అందుకే వాజ్‌పేయి హయాంలో కూడా అభ్యంతరాలు లేవనెత్తిన స్వదేశీ జాగరణ్ మంచ్ లాంటి సంస్థలు అవతారం చాలించినట్టున్నాయి. ప్రస్తుతం మోదీ చేసేపనులకు పక్క వాయిద్యాలు వాయించే స్థితికి ఆర్.ఎస్.ఎస్. చేరుకున్నట్టుంది.

దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ అని చెప్పుకునే బీజేపీ మాత్రం ఒకే ఒక్క నాయకుడైన మోదీ మాటను జవదాటేస్థితిలో లేదు. ఆయనే సర్వాంతర్యామి. ఆయన చెప్పిందే వేదం. మోదీ మంత్రివర్గంలో ముగ్గురు, నలుగురు మంత్రులను మినహాయిస్తే మిగతా వారందరూ అనామకంగానే మిగిలిపోయారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆయనే ప్రత్యక్షమవుతారు. అవి శాసనసభ ఎన్నికలు కావొచ్చు. సార్వత్రిక ఎన్నికలు కావచ్చు. మోదీ, అమిత్ షా ద్వయం అనడం కూడా మాటవరసకులాగే ఉంది. అన్నీ తానే అయి మోదీ అటు ప్రభుత్వాన్ని, ఇటు బీజేపీని ఒంటి చేతిమీద నడిపిస్తున్నారు. ఏ నిర్ణయమైనా ఆయన తీసుకోవలసిందే. అందరూ ఆయన కనుసన్నలలో మెలగాల్సిందే. ఈ విషయంలో ఆయన వ్యవహారసరళి అచ్చం ఇందిరా గాంధీని తలపిస్తోంది. బీజేపీ, ఆర్.ఎస్.ఎస్. చాలా సువ్యవస్థితమైన సంస్థలు అనుకుంటారుగదా! అలాంటప్పుడు ఒకే ఒక్క నాయకుడు దివారాత్రులు శ్రమించవలసిన పరిస్థితి ఎందుకు వస్తోంది? చిన్నా పెద్ద అన్ని ఎన్నికలకు ఆయనే సూత్రధారి. ఆయనే ప్రధాన ప్రచార నిర్వాహకుడు. ఎనిమిదేళ్లు దాటినా మోదీ ఏలుబడిలో ప్రస్ఫుటంగా కనిపించే బృందం ఏదీ లేదు. ఉమ్మడి నిర్ణయాలు మచ్చుకు కూడా లేవు. ఆయన తరవాత ఫలానా నాయకుడు పలుకుబడిగలవారు అని చెప్పడానికి అవకాశం కనిపించడం లేదు.

కరోనాకు టీకాలు వేయించినా అన్ని పెట్రోల్ బంకుల్లో "ధన్యవాదాలు మోదీ" అన్న భారీ ప్రచారబోర్డులే దర్శనమిస్తాయి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే గుజరాత్ మారణకాండ జరిగింది. దేశమంతా మాత్రమే కాకుండా ప్రపంచ మంతా గగ్గోలు వినిపించింది. అమెరికా ఆయనకు వీసా ఇవ్వడానికి కూడా ఆ దశలో నిరాకరించింది. ఇప్పుడు అంతర్జాతీయంగా కూడా ఆయనే ప్రముఖ నాయకుడన్న ప్రచారం జరుగుతోంది. బీజేపీని, పరి పాలనను మోదీ వ్యక్తి ప్రధానమైన, ఏకవ్యక్తిమీద ఆధారపడ్డ వ్యవహారంగా మలిచేశారు. నెహ్రూ తరవాత ఎవరు అన్న ప్రశ్న వినిపించేది. మోదీ తరవాత ఎవరు అని అడిగే సాహసం ఆ పార్టీలో కూడా ఎవరూ చేయలేరు. రాజ్యాంగ వ్యవస్థలు మోదీ ఏలుబడిలో ధ్వంసం అయ్యాయంటున్నారు. అందులో అంతా నిజమే ఉన్నా బీజేపీని కూడా ఏకేశ్వరో పాసనకు కట్టుబడ్డపార్టీగా మార్చిన ఘనతా మోదీదే. పార్టీగా బీజేపీ అస్తిత్వాన్నే మాయం చేసేటంతటి శక్తి మోదీ సంతరించు కున్నారు. మన రాజకీయ వ్యవస్థలో పార్టీలది ప్రధాన పాత్ర. కానీ మోదీ చలవవల్ల బీజేపీ కన్నా ఆయనే పెద్ద గీతగా తయారయ్యారు. ఇదీ ప్రజా స్వామ్యాన్ని విధ్వంసం చేసేదే. ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ మోదీకి భాష్యకారుడిగా మిగిలిపోవడంలో ఎంతమాత్రం ఆశ్చర్యం లేదు.

రహస్య పత్రాల చిక్కుల్లో నేడు బైడెన్, నాడు ట్రంప్

కంచె చేను మేస్తే ఎవరికి చెప్పుకోవాలి. చాలా దేశాల్లో అలా ఉంది. అత్యున్నత స్థాయి అధికారం ఉన్న పాలకులపై తీవ్రమైన నేరారోపణలు వస్తున్నాయి. అగ్రరాజ్యంగా పేరొందిన అమెరికా ఇందుకు మినహాయింపుకాదని దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌లు రహస్య పత్రాలను చోరీచేసి తమ ఇళ్లల్లో దాచుకున్న విషయం ధృవీకరించింది. ఇద్దరిపై వచ్చిన నేరా రోపణలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. వీరిద్దరూ రానున్న అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీచేయాలని ఆశిస్తున్నారు. ట్రంప్ తన పామ్‌బీచ్ నివాసభవనాల్లో ఎఫ్‌బీఐ అధికారులు రోజులతరబడి సోదాలుచేసి పదకొండు పెద్దపెట్టెల్లో దాచుకున్న రహస్య పత్రాలను స్వాధీనం చేసుకొని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేయగా దర్యాప్తు జరుగు తోంది. అయితే అన్ని ఆరోపణలను బుకాయించినట్టుగానే ఈ నేరాన్ని కూడా ట్రంప్ అంగీకరించడానికి సిద్ధంగా లేరు. గతంలో ట్రంప్ గెలిచినప్పుడు రష్యా సహకరించిందన్న ఆరోపణలకు సంబంధించిన రహస్యపత్రాలు కూడా ఉన్నాయన్న సమాచారం వెలుగుచూపింది. దీనిపైన సొంతపార్టీ(రిపబ్లికన్)లో సైతం తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ సారి ఎన్నికల్లో ట్రంప్‌ను రిబ్లికన్ పార్టీ ప్రతినిధిగా పోటీచేయించే అవకాశాలు తక్కువేనని తెలుస్తోంది. ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా మాట్లాడి ప్రపంచమంతటా అపహాస్యంపాలైన అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే ఆయనకు అనేక దేశాలలోగల వ్యాపారాలపై దాదాపు 18లక్షల కోట్ల డాలర్లు పన్ను చెల్లించకుండా ఎగవేశారన్న కేసుపై దర్యాప్తు జరుగుతూనే ఉంది. డెమోక్రాటిక్ పార్టీ తరఫున బైడెన్ గెలుపును అంగీకరించకుండా నానా అల్లరి చేశారు. చివరికి ఆయన అనుచరులు అధ్యక్ష భవనం కేపిటల్ హిల్‌మీద దాడిచేసి బీభత్సం సృష్టించారు. ఇలాంటి దుర్మార్గమైన ఘటనకు కారణమై తీవ్ర నేరానికి పాల్పడ్డారు.

ప్రస్తుతం అధ్యక్షుడు బైడెన్ మీద అవినీతి, నేర ఆరోపణలు లేవనుకుంటున్న తరుణంలో ఆయన ఇంట కూడా రహస్యపత్రాలూ దొరికాయి. ఇలాంటి నేరారోపణలో తానూ తక్కువవాడిని కాదని బైడెన్ నిరూపించుకున్నాడు. దేశంలో ఆర్థికమాంద్యం, ద్రవ్యోల్బణం, ధరలు పెరగడం, ఒమిక్రాన్ మహమ్మారి కొత్తరకం కేసులు విస్తరిస్తున్న సందర్భంలో బైడెన్‌పై తీవ్ర నేరారోపణలు రావడం మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయడానికి పెద్ద ఆటంకం కావచ్చు. రహస్య పత్రాలపై దర్యాప్తు కోసం అటార్నీ జనరల్ మెరిక్ గార్లండ్ ప్రత్యేక న్యాయాధికారిని నియమించారు. రహస్యపత్రాలు దాచింది నిజమేనని డెమొక్రాట్లు ప్రైవేటు చర్చల్లోనూ, బహిరంగంగానూ అంగీకరిస్తున్నారు. గత అధ్యక్షుడు ట్రంప్‌పై రహస్యపత్రాలు దొంగిలించిన, అలాగే వివిధ చట్టఉల్లంఘనలపై ఫెడరల్ క్రిమినల్‌కేసుగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరిద్దరిపై వచ్చిన నేరారోపణలలో తేడాలున్నాయి. తన ఇంట్లో రహస్య పత్రాలున్న విషయం తెలిసినప్పటికీ వాటిని వెలికి తీయడానికి, కావాలని అడ్డుపడటానికి బైడెన్ ప్రయత్నించలేదన్న అభిప్రాయం ఉంది. ట్రంప్ మాత్రం కావాలని దర్యాప్తు అధికారులను అడ్డుకున్నారు.

అమెరికానే శాసించగల అధ్యక్షులను సైతం దర్యాప్తు చేయడానికి ఎఫ్‌బిఐ లాంటి సంస్థలకు స్వతంత్రత, స్వేచ్ఛ ఉంది. దర్యాప్తుకు అదేశించగల అధికారం, స్వతంత్రంగా పనిచేయగల అవకాశం ఉండటం వాటి ప్రత్యేకత. అనేక విషయాలలో ప్రజాస్వామ్య దేశం అనిపించుకోలేని అమెరికాలో ఈ అంశంలో ప్రజాస్వామ్యం నెలకొనిఉందని చెప్పవచ్చు. భారతదేశంలోనూ ప్రజాస్వామ్యవ్యవస్థ ఉంది. ఇక్కడ సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయా? ఇవి స్వతంత్రంగా పనిచేయడంలేదని పాలకుల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని అనేకమంది విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. బ్యాంకులకు చెల్లించవలసిన లక్షలు, వేల కోట్ల రూపాయలు ఎగవేసినవారిపై కేసులు నమోదుచేసి ఏమైనా వసూలు చేశారా? దర్యాప్తు చేయడానికి దశాబ్దాలుఎందుకు పడు తున్నదని ఒకకేసులో విచారణ జరుపుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి వేసిన ప్రశ్నకు సీబీఐఅధికారి సమాధానం చెప్పలేకపోయారు. దర్యాప్తు సంస్థలేకాదు పోలీసువ్యవస్థ సైతం అధికారంలోఉన్న పాలకుల కనుసన్నల్లో పనిచేస్తున్నప్పుడు ప్రజాస్వామ్యపాలన నడుస్తున్నదని ఎలా భావించగలము?

-ఎడిట్ డెస్క్

ఆర్ఇవిఎంలు అసంపూర్ణం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

దాదాపు ఎనిమిదేళ్ల క్రితంనాటి 2014 రాజకీయ స్థితిని అధికార, ప్రతి, ప్రత్యామ్నాయపక్షాలు సరిగా విశ్లేషించుకోలేదు. భవిష్యత్తు రాజకీయస్థితిని అంచనా వేయలేదు. 2014 ఎన్నికల తర్వాత ఓటేయని వారి గురించి ఆలోచించసాగాయి. ఓటు నమోదు చేసుకున్న ప్రాంత పోలింగ్‌బూత్‌నుంచి కాక రాష్ట్రంలో, రాష్ట్రేతర ప్రాంతంలోని ఇతర నియోజకవర్గాల పోలింగ్‌బూత్ నుంచి ఓటేసే సౌకర్యాన్ని రిమోటింగ్ ఓటింగ్ అంటారు. ఇందుకు ఎన్నికల సంఘం రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లను(ఆర్ఇవిఎం) ప్రతిపాదించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, దేశ జనాభాలో 37శాతం అనగా 45.36 కోట్ల వలస ఓటర్లున్నారు. వీరిలో 27.8 కోట్ల మంది గ్రామీణులు కాగా, 17.56 కోట్ల మంది పట్టణవాసులు, 30.96 కోట్ల మంది స్త్రీలు, 14.4 కోట్ల పురుషులు ఉన్నారు. 2019 సాధారణ ఎన్నికల్లో 91.2కోట్ల ఓటర్లలో 67.4శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 32.6శాతం అనగా 30 కోట్ల మంది ఓటేయలేదు. ఇది అమెరికా జనాభాతో సమానం. బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, రాజస్థాన్ వగైరా రాష్ట్రాల నుంచి వలస కూలీలు ఎక్కువ. 2019 ఎన్నికల్లో బిహార్‌లో 57.33శాతం, ఉత్తరప్రదేశ్‌లో 59.21శాతం మంది ఓటేశారు. ఇది జాతీయ ఓటుశాతం 67.4 కంటే తక్కువ.

పట్టణవాసులు ఓటేయడానికి సుముఖంగా ఉండరు. యువతకు ఓటింగ్‌పై ఉదాసీనత. వలసదార్లకు తామున్న స్థలంలో ఓటుహక్కు ఉపయోగించుకునే అవకాశంలేదు. వలసలకు నాలుగు కారణాలు. యువకులు చదువుకోసం స్వస్థలాలు వదిలి వెళతారు. స్త్రీలు పెళ్లి తర్వాత పుట్టినిల్లు వదులుతారు. చదువరులు ఉద్యోగం కోసం, కూలీలు బతుకుదెరువు కోసం వలసపోతారు. ముఖ్యగా గ్రామాల నుంచి వలసలు ఎక్కువ. 85శాతం వలసలు రాష్ట్రం లోపలే జరుగుతాయి. పనిస్థలం మారిన ప్రతిసారీ వలస కార్మికులు కొత్త ప్రదేశంలో ఓటు నమోదు చేసుకోలేరు. అంతేగాక సొంత ఊరిలో ఓటును రద్దుచేసు కోడానికి ఇష్టపడరు. దూర ప్రాంతాలవారు పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటేయ వచ్చు. ఈ సౌకర్యం సైనికులకు, విదేశాల్లోని ప్రభుత్వోద్యోగులకు, దౌత్య సిబ్బందికి, దేశంలో అత్యవసర సేవల్లో ఉన్నవారికి, 80 ఏళ్లు దాటిన ఓటర్లకు, కోవిడ్ రోగులకు మాత్రమే వర్తిస్తుంది. వలసదారుల ఓటుహక్కు రక్షణకు సురక్షిత సుదూర ఓటింగ్ పద్ధతిని ప్రవేశపెట్టించమని కేరళకు చెందిన కె.సత్యన్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. రిమోట్ ఓటింగ్ అవకాశాలను పరిశీలించమని సుప్రీంకోర్టు 2015లో ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అది వివిధ ప్రత్యామ్నాయ ఓటింగ్ పద్ధతులను పరిశీలించింది. అవి భౌతిక రవాణా పోస్టల్ బ్యాలట్, ప్రాతినిధ్య ఓటింగ్. ముందస్తు ఓటింగ్ కేంద్రాల్లో ముందస్తు ఓటింగ్, ఏక మార్గ/రెండు మార్గాల ఎలక్ట్రానిక్ ప్రసార పోస్టల్ బ్యాలట్, అంతర్జాల ఓటింగ్ వాటిలో కొన్ని. వీటి కంటే ఆర్ఇవిఎంలు మెరుగని వీటిని అభివృద్ధి పరిచింది. వలసదారులు రిమోట్ ఓటింగ్ అవసరాన్ని నమోదు చేసుకోవాలి. వారి ఓటును నియోజకవర్గ ఓటు రికార్డుతో ధృవీకరిస్తారు. తగిన సంఖ్యలో

అభ్యర్థులున్న పక్షంలో రిమోటింగ్ ఓటింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తారు. సుప్రీంకోర్టు ఆదేశించిన ఎనిమిదేళ్ళకు ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రోజు(16వ తేదీన)ఆర్ఈవిఎంలను 8 జాతీయ, 57 ప్రాంతీయ పార్టీల ప్రతినిధులకు ప్రదర్శించింది. వీరు 31.01.23లోపు తమ అభిప్రాయా లను లిఖితపూర్వకంగా తెలపాల్సిఉంది.

1989లో ఈవిఎంలను తయారుచేసిన ప్రభుత్వరంగ సంస్థలు బెంగళూరు భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బిఇఎల్), హైదరాబాదు ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఇసిఐఎల్) రిమోట్ ఈవిఎంలను అభివృద్ధి చేశాయి. 2006-10లలో తయారైన మార్క్ 2 ఈవిఎంలు ఒక కంట్రోల్ యూనిట్ ఒక్కొక్కటి 16మంది అభ్యర్థులతో 4 బ్యాలట్ యూనిట్లతో 64మంది అభ్యర్థులకు స్థానం కల్పిస్తాయి. 2013లో తయారైన మార్క్ 3ఈవిఎంలు 24 బ్యాలట్ యూనిట్లతో 384 మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తాయి. ఆర్ ఈవిఎంలు ఒక రిమోట్ పోలింగ్‌బూత్‌నుంచి 72నియోజకవర్గాలను అనుసంధానిస్తాయి. ఒక ఈవి ఎంలో 2000ఓట్లు నమోదవుతాయి. మార్క్2 ఈవిఎంఖరీదు రూ.8, 670లు. మార్క్ 3 ఈవిఎం ఖరీదు రూ.17వేలు. ఓట్ల నమోదుకు ముందు అన్నిపార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజల్ట్ బటన్‌నొక్కి ముందుగా ఓట్లు నమోదుకాలేదన్న విషయాన్ని ధృవీకరిస్తారు. నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఓటింగ్ సరళిని గుర్తించకుండా ఓట్ల లెక్కింపుకు ముందు14 ఈవిఎంలలో నమోదైన ఓట్లను కలగలిపే టోటలైజర్ ఏర్పాటు ఉంది. ఫలితాల్లో తలెత్తగల గొడవలన్నీ సమసిన తర్వాత డిలిట్ చేస్తేనే ఈవిఎంలలో నమోదైన ఓట్లు రద్దవుతాయి. ఈవిఎంల జీవితకాలం 15ఏళ్లు. వాటి జీవితకాలం ముగిసేవరకు నమోదైన ఓట్లను చెరపకుండా ఉంచవచ్చు. రిమోట్ ఈవిఎంల అమలుకు ప్రజాప్రాతినిధ్యచట్టం 1950,1951లను, ఎన్నికల నిర్వహణ నియమాలు 1960లను, ఓటర్లనమోదు నియమాలు 1961లను సవరించాలి. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 19 ప్రకారం ఓటరు తాను నివసించే నియోజకవర్గంలోనే ఓటునమోదు చేసుకోవాలి. పోలింగ్ బూత్‌లో వ్యక్తిగతంగా ఓటేయాలి.

రిమోట్ ఓటింగ్ సామాజిక మార్పుకు దారితీయగలదు. దానితో ప్రజాస్వామ్యం బలపడుతుంది. ఓట్లను కొనే, ఓటర్లను ప్రలోభపెట్టి, భయ భ్రాంతులకు గురిచేసే అవకాశాలు తగ్గవచ్చు. పీడిత వలసజీవులకు, అందులో అధిక సంఖ్యలోని స్త్రీలకు ఓటువేసే అవకాశం లభిస్తుంది. వారి అసంతృప్తులు ఓటింగ్‌లో ప్రతిబింబిస్తాయి. మనం నాలుగు ప్రజాస్వామ్య స్తంభాల గురించే మాట్లాడతాం. అతి ప్రధానమైన ఐదవ స్తంభం ప్రజాభిప్రాయం. ఉత్పత్తి సాధనాలు తమవి కాకపోయినా జాతీయోత్పత్తికి పాటుబడుతున్న వలసజీవులు, విద్యార్థులు, యువకులు, స్త్రీలు అసలైన ప్రజలు. వారి అభిప్రాయం ఈ రిమోట్ ఓటింగ్ పద్ధతిలో ప్రతిబింబిస్తుంది. రిమోట్ ఓటింగ్ పద్ధతి ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని తొలగిస్తుందని గుజరాత్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ అన్నారు. 15.1.2023న కాంగ్రెస్ పిలుపుతో ప్రతిపక్షాల సమావేశం జరిగింది. సమాజ్‌వాది, నేషనల్ కాంగ్రెస్, తృణముల్ కాంగ్రెస్, ఆప్ పార్టీలు హాజరుకాలేదు. ఆర్ఈవీఎంల ఉపయోగం అసంపూర్ణంగా, గందరగోళంగా ఉందని ఆ సమావేశంలో వాటిని వ్యతిరేకించారు. ప్రదర్శన చూడకముందే ఇలా వ్యాఖ్యానించడం సబబా?

ఆర్ఈవిఎంలను ప్రవేశపెట్టే ముందు ఈవిఎంలపైఉన్న అనుమానాలను ఎన్నికల సంఘం తీర్చాలి. లోపాలను సరిచేయాలి. ఓటింగ్‌లో నూరు శాతం రహస్యత లోపించింది. ఇది రాజ్యాంగ అధికరణ 324ను, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 128ను ఉల్లంఘిస్తోంది. తప్పుగా నమోదైన ఓటును సరిదిద్దే సౌకర్యం వివిపాట్ పద్ధతిలో లేదు. ఎన్నికల ఫలితాలపై నూరుశాతం ఎన్నికల అనంతరం తనిఖీ జరగాలి. తర్వాతే ఫలితాలను ధృవీకరించాలి. ఇవేమీ జరగకుండానే ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో 347 నియోజకవర్గాల్లో తేడాలు బైటపడ్డాయి. ఈ తేడాలు 1,01,323 ఓట్ల వరకు ఉన్నాయి. పోలైన ఓట్లలో7,39,104 ఓట్లతో ఈ తేడా10.49శాతం. ఆరు నియోజకవర్గాల్లో గెలుపు ఆధిక్యత కంటే ఓట్ల తేడా ఎక్కువ. ఇవి నేటికీ పరిష్కారం కాలేదు. రాజ్యాంగ అధికరణ 324 ప్రకారం ఎన్నికల పర్యవేక్షణ, ఆదేశాలు, సూచనలు, నియంత్రణ ఎన్నికల సంఘానికి ఉండాలి. ఓటింగ్ మెషిన్లను తయారుచేసే బిఈఎల్, ఇసిఐఎల్ సంస్థలపై ఎన్నికల సంఘానికి నియంత్రణ లేదు. ఎన్నికల నిర్వహణ, ఫలితాలపై వచ్చిన సమాచార హక్కుచట్ట ప్రశ్నలపై ఎన్నికల సంఘం నిశ్శబ్దం పాటిస్తోంది.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సెల్: 9490 20 4545

బ్రెజిల్‌లో కుట్రపూరిత విధ్వంసం!

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్రలో భాగంగా మాజీ అధ్యక్షుడు బొల్సొనరో మద్దతు దారులు, ఆయన ఆదేశాల మేరకు నేషనల్ కాంగ్రెస్, సుప్రీంకోర్టు, అధ్యక్ష భవనాలపై దాడిచేసి విధ్వంసానికి పాల్పడి వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నంచేసి విఫలమయ్యారు. ఈ దాడిలో నేషనల్ కాంగ్రెస్ భవనం ధ్వంసమైంది. చట్టసభ్యుల కార్యాలయాల్లోకి చొరబడి నాశనం చేశారు. ప్రభుత్వంపై తిరగబడమని సైన్యాన్ని ఉద్దేశించి బ్యానర్లు ఎగురేశారు. సైన్యం లూలా డ సిల్వాకు మద్దతుగా నిలబడి తిరుగుబాటును అణచివేసింది. దక్షిణ అమెరికా దేశాల్లో బ్రెజిల్ అతిపెద్ద దేశం. దక్షిణ అమెరికా భూభాగంలో బ్రెజిల్ సగం విస్తీర్ణత కలిగిఉంది. జనాభారీత్యా ప్రపంచంలోనే ఆరవ అతిపెద్ద దేశం. దక్షిణఅమెరికా ఖండంలో 45.3శాతం భూభాగం కలిగిఉంది. బ్రెజిల్‌లోని అమెజాన్ ముఖద్వారంలో విస్తారమైన ఉష్ణ మండల అరణ్యాలు విస్తరించి ఉన్నాయి. వైవిధ్యమైన పర్యావరణం, విస్తారమైన జంతుజాలం, సహజ వనరులు అభయారణ్యాలకు బ్రెజిల్ నిలయంగా ఉంది.

బ్రెజిల్ 1500 సంవత్సరం నుంచి 1822 వరకు పోర్చుగీస్ వలస పాలన కింద ఉంది. 1822లో స్వాతంత్ర్యం పొందింది. 1824లో మొట్ట మొదటి రాజ్యాంగం ఆమోదంపొంది ద్విసభ శాసనసభ ఏర్పడింది. ప్రస్తుతం బ్రెజిల్ "నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ బ్రెజిల్"గా పిలుస్తున్నారు. 1889లో జరిగిన తిరుగుబాటు తర్వాత ప్రెసిడెన్షియల్ రిపబ్లిక్‌గా మారింది. 1964లో మరో సైనిక తిరుగుబాటు జరిగి అధికారిక బ్రెజిలియన్ సైనిక నియంతృత్వ ప్రభుత్వం ఏర్పడి 1985 వరకు అధికారంలోఉంది. 1988లో రూపొందించిన ప్రస్తుత బ్రెజిల్ రాజ్యాంగం ఫెడరల్ రిపబ్లిక్‌గా గుర్తింపు పొందింది. ఐక్యరాజ్యస్థాపక దేశాల్లో బ్రెజిల్ ఒకటి. వలసపాలనలో, సైనిక నియంతృత్వపాలనలో ఆర్థిక అసమానతలు తీవ్రంగాఉన్నాయి. సైనికపాలన తొలగినా, దాని ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. ఆర్థిక అసమానతల్లో మార్పులు సంభవించలేదు. దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు అమలు జరిగాయి. పేదరికం,నిరుద్యోగం పెరిగింది. ప్రజా అణచివేత చట్టాలు అమలు జరిగాయి. విదేశీ పెట్టుబడులు, విదేశీ రుణాల శాతం పెరిగింది. దేశంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది.

లూలా డ సిల్వ పాలన: సైనిక పాలనలో దేశం సంక్షోభంలో ఉన్న సమయంలో బ్రెజిల్ వర్కర్స్ పార్టీ స్థాపన జరిగింది. అందుకు లూలా డ సిల్వా తోడ్పాటు అందించాడు. 1986లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో సావోపోలో రాష్ట్రం నుంచి దేశంలోనే అత్యధిక మెజారిటీతో ఫెడరల్ డిప్యూటీగా ఎన్నికయ్యాడు. 1994, 1998 సంవత్సరాల్లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయాడు. తిరిగి 2002లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి లూలా విజయం సాధించాడు. 2006లోనూ అధ్యక్షునిగా తిరిగి ఎన్నికయ్యాడు. లూలా డ సిల్వా పాలనలో ప్రజా అనుకూలమైన అనేక సంస్కరణలు అమలు జరిగాయి. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల ద్వారా సంపదను పునఃపంపిణీ చేసింది. కొనుగోలుశక్తి పెరగటానికి కనీస వేతనాన్ని పెంచింది. దానిఫలితంగా దేశ స్థూలఆదాయం అభివృద్ధి చెందింది. ప్రజలపై రుణభారం, ద్రవ్యోల్బణం తగ్గింది. రెండుకోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరికం, అసమానత, నిరక్షరాస్యత, నిరుద్యోగం, శిశు మరణాలు, బాల కార్మికుల రేటు గణనీయంగా తగ్గింది. కనీసవేతనం, సగటు ఆదాయం పెరిగింది. ఆ విధంగా కొన్ని పరిమిత ప్రజానుకూల విధానాలతో తనపాలనలో లూలా డ సిల్వా మార్పులు తీసుకొచ్చాడు. లూలా ఆర్థిక విధానాలు పెట్టుబడి దారుల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటంతో, వాటిని వ్యతిరేకిస్తూ, లూలా వ్యతిరేక ప్రచారం తీవ్రంగాచేశారు. ఈ ప్రచారానికి తోడుగా 2014లో ఆపరేషన్ కార్‌వాచ్ ద్వారా కొందరు మంత్రుల అవినీతి బయట పడటం, దానికి లూలాను బాధ్యతచేసిన ఫలితంగా 12 సంవత్సరాల శిక్ష విధించి జైలుకు పంపటం కుట్రపూరితంగా జరిగింది.

రాజకీయ సంక్షోభం: లూలా వారసుడిగా బ్రెజిల్ వర్కర్స్ పార్టీ తరఫున దిల్మా రౌసెఫ్ దేశ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆమె స్థూల ఆర్థిక పన్ను మినహాయింపులు, సబ్సిడీలు ప్రవేశ పెట్టారు. 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి ఏసియా సెవ్స్‌ను స్వల్ప తేడాతో ఓడించి దిల్మా రౌసెఫ్ అధ్యక్షురాలుగా రెండవసారి ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక వివాదాస్పదం కావటం, ఆపరేషన్ కార్‌వాస్, ఆర్థిక సంక్షోభం కారణంగా దిల్మా రౌసెఫ్‌పై తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. 2015 నాటికి ఆమె అనుకూల రేటు 8శాతం పడిపోయింది. 2014 జూన్ నుంచి బ్రెజిల్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. దేశ స్థూలదేశీ యోత్పత్తి (జీడీపీ) 2015లో 3.5శాతం కాగా, 2016లో 3.3శాతానికి పడిపోయింది. నిరుద్యోగం 2014లో 6.8శాతం కాగా, 2015 నాటికి 8.5శాతానికి చేరుకుంది. 2015లో ఆర్థిక వ్యవస్థ 1.5మిలియన్ల ఉద్యోగాలను కోల్పోయింది. 2016 నాటికి నిరుద్యోగం పెరుగుతూ 12శాతానికి చేరింది. నిరు ద్యోగులు కోటి, ఇరవైలక్షల 30వేల మంది ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం 20లక్షల 80వేల ప్రైవేట్ ఉద్యోగాలు తగ్గాయి. దీని ఫలితంగా దిల్మా

రౌసెఫ్ నాయకత్వంపై ప్రజల్లో అసంతృప్తి ప్రబలింది. 2019 మొదటి త్రైమాసికంలో మొత్తం నిరుద్యోగం రేటు 12.7శాతం ఉంది.

లోటు బడ్జెట్: మాంద్యం, ఆర్థిక సంక్షోభానికి పెరుగుతున్న బడ్జెట్‌లోటుకి కారణమైంది. ఆర్థికమాంద్యం కారణంగా గత రెండేళ్లలో పన్నుల వసూళ్లు తగ్గి, ఖర్చులు పెరిగాయి. వాలర్ ఎకనామికో అనే మ్యాగజైన్ ద్వారా పొందిన పంథా కో గెట్యువియో వర్గాస్ (FGV) లో భాగమైన (Institute to Brasileiro de Economia (IBRE) 2019 అధ్యయనం ప్రకారం, సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. మరోవైపు గత ఏడేళ్లలో 10శాతం అగ్రశ్రేణి సంపన్నుల సంపద 8.5శాతం పెరిగింది. పేదల సంపద 14శాతానికి పడిపోయింది. దేశంలో ఏర్పడిన సంక్షోభం వలన దిల్మా రౌసెఫ్ అభిశంసనకు గురైంది. ఫలితంగా రౌసెఫ్ స్థానంలో మిచెల్ టిమెర్ అధ్యక్షుడయ్యాడు. 2018లో జరిగిన ఎన్నికల్లో సోషల్ క్రిస్టియన్ పార్టీ తరఫున బొల్సొనరో పోటీచేసి గెలుపొంది 2019లో దేశ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. బొల్సొనరో పచ్చిమితవాద, ఛాందసవాద పెట్టుబడిదారీ వర్గ రాజకీయాలకు ప్రతినిధి. 1964 నుంచి 1985 వరకు బ్రెజిల్‌ని పాలించిన సైనిక ప్రభుత్వంపై అభిమానాన్ని వ్యక్తం చేశాడు. సైనిక ప్రభుత్వంలో కెప్టెన్ అయ్యాడు. అనేకసార్లు పార్టీలుమారి చివరికి సోషల్ క్రిష్టియన్ పార్టీలో చేరి అధ్యక్షుడయ్యాడు. అధ్యక్షుడవటానికి ఎన్నికల ప్రచారంలో అనేక బూటకపు వాగ్దానాలు చేశాడు. అవినీతిని రూపుమాపుతానని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తానని, 2015 ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలుగుతామని, లూలా డ సిల్వా సంస్కరణల వలన దేశంలో ఆర్థికసంక్షోభం ఏర్పడిందని, ప్రత్యర్థులకు అవకాశం ఇస్తే దేశం నాశనమౌతుందని ప్రజల్లోకి అవాస్తవాలను బలంగా తీసుకెళ్లాడు.

అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేయటానికి బొల్సొనరో నిరంతర ప్రయత్నం చేశాడు. స్త్రీలపై అమిత ద్వేషాన్ని, మానవత్వ విలువలపై వ్యతిరేకత ప్రదర్శించాడు. మురికివాడల్లో నివసించే పేదలను నేరస్తులుగా, మాదకద్రవ్యాల అక్రమ రవాణా దారులుగా చిత్రించాడు.

పర్యావరణంపై ఏమాత్రం బాధ్యత లేకుండా, అమెజాన్ అడవుల విధ్వంసానికి పూనుకున్నాడు. ప్రజల మధ్య విద్వేషాలు పెంచాడు. పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూల విధానాలు అమలు పర్చాడు. సుప్రీంకోర్టును తన అనుయాయులతో నింపాడు. ఫెడరల్ వ్యవస్థను పూర్తిగా కేంద్రీకృతానికి మార్చాడు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగింది. అవినీతి కుంభకోణాలకు పాల్పడ్డాడు. వీటన్నిటి ఫలితంగా ప్రజల ఆగ్రహానికి గురయ్యాడు. 2022 బ్రెజిల్ ఎన్నికల నాటికి లూలా డ సిల్వా జైలు నుంచి విడుదలయ్యాడు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశాడు. బొల్సొనరో, లులా డ సిల్వా పరిపాలన మధ్య వ్యత్యాసం చూసిన ప్రజలు లూలా డా సిల్వాను తిరిగి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని బొల్సొనరో అభిమానులు కుట్రతో తిరుగుబాటు చేయగా ప్రభుత్వం అణచివేసింది.

బొల్లిముంత సాంబశివరావు,
సెల్: 9885983526

రూ. 40 కోట్ల విలువైన యాబా మాత్రలు స్వాధీనం

కరీంగంజ్/ హైలాకండి (అసోం): అసోంలోని కరీంగంజ్ జిల్లాలో సుమారు రూ.40 కోట్ల విలువైన నిషిద్ధ యాబా మాత్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. సోమవారం అర్ధరాత్రి కరీంగంజ్ పట్టణానికి 22 కిలోమీటర్ల దూరంలోని బగరుల్ ప్రాంతంలో కారులో సుమారు 88 కిలోల బరువున్న ఏడు లక్షల యాబా మాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు పోలీసు సూపరింటెండెంట్ పార్థ ప్రతిమ్ దాస్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎప్పటిలాగే రాత్రి పూట తనిఖీలు చేస్తుండగా కారులో మాత్రలు దొరికాయని వీటి ధర సుమారు రూ. 40 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారులో సోదా చేస్తుండగా కారులో ఉన్నవారు తప్పించుకోగలిగారని ప్రతిమ్ దాస్ తెలిపారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కర్ణాటకలోనూ గుజరాత్ విధానమే!

- బొమ్మైని తప్పించే వ్యూహంలో బీజేపీ
- పెరుగుతున్న యెడ్యూరప్ప ప్రాధాన్యం

బెంగళూరు: గుజరాత్‌లో మాదిరిగా కర్ణాటకలో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా గుజరాత్‌లో అనుసరించిన విధానాన్నే కర్ణాటకలో అనుసరించేందుకు బీజేపీ వ్యూహం రూపొందిస్తున్నది. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైపై ప్రజల్లో చోటుచేసుకున్న ఆగ్రహం ప్రభావం పార్టీపై చూపకుండా ఉండేందుకు ఆయన్ను తప్పించేందుకు బీజేపీ చూస్తున్నది. ఆయన స్థానంలో మరోసారి యెడ్యూరప్పకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చే విషయంపై చర్చలు కొనసాగుతున్నాయి. దిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. తొలిరోజు గుజరాత్ విధానంపై తీవ్రంగా చర్చించిన బీజేపీ అధిష్ఠానం ఆ నమూనాను కర్ణాటక ఎన్నికల్లో ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లుగా తెలుస్తున్నది. మే నెలాఖరులోగా కర్ణాటకలో సాధారణ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. సమయం తక్కువగా ఉండటం, ప్రస్తుత సీఎంపై ప్రజల్లో కోపం ఉండటంతో ఆయన్ను మార్చేందుకు బీజేపీ చూస్తున్నది. ఇదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యెడ్యూరప్పకు మరోసారి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో యెడ్యూరప్పతో ప్రధాని మోదీ 15 నిమిషాల సేపు మాట్లాడటం ఇందుకు బలం చేకూరుస్తున్నది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ పార్టీలో యెడ్యూరప్ప ప్రాధాన్యం పెరుగుతున్నది. ఆయనను పార్టీ పార్లమెంటరీ బోర్డులో కూడా తీసుకున్నారు. లింగాయత్ సామాజికవర్గం మద్దతు ఆయనకు ఉండటంతో రానున్న ఎన్నికల్లో యెడ్డీ పేరుతో లబ్ది పొందాలనేది బీజేపీ వ్యూహంగా ఉన్నది. మరోవైపు కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మహారాష్ట్రతో సరిహద్దు వివాదంలో చిక్కుకున్నారు. ఆయనను పదవి నుంచి తప్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. దక్షిణాదికి ముఖద్వారం అయిన కర్ణాటక బీజేపీకి చాలా ముఖ్యమైనది. ఇక్కడ తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేయడం బీజేపీకి చాలా అవసరం. అందుకోసం ప్రజల్లో మద్దతు ఉన్న నాయకునికి పదవి కట్టబెట్టడం ద్వారా ఫలితం సాధించవచ్చునని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నది.

మౌనిక విద్యాభ్యాసం ఖర్చు ఏఐబీఈఏదే

ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం ప్రకటన

విశాలాంధ్ర-హైదరాబాద్: గుడ్ గవర్నెన్స్‌డే సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాలులో జరిగిన యూత్ పార్లమెంట్ సమావేశంలో ప్రసంగించి దేశ ప్రజలందరినీ ఆకట్టుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన గిరిపుత్రిక కేతావత్ మౌనిక విద్యభ్యాసం తోపాటు సివిల్స్ శిక్షణకు అయ్యే ఖర్చును అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) భరిస్తుందని ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటాచలం ప్రకటించారు. ఇక్కడి కోఠిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన బ్యాంకు ఉద్యోగుల సదస్సులో కేతావత్ మౌనికను సీహెచ్. వెంకటాచలం, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు వేదికపైకి ఆహ్వానించి శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటాచలం మాట్లాడుతూ గిరిజన అమ్మాయి చిన్న గ్రామం నుంచి పార్లమెంటు సెంట్రల్ హాలో ప్రసంగించే స్థాయికి ఎదగడం గొప్ప విషయమని అన్నారు. బాలికల విద్య ప్రాముఖ్యతను తాము విశ్వసిస్తామని, బాలికల విద్య ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుందని, అసమానతలను తగ్గిస్తుందని అన్నారు. పేద బాలికల విద్యకు, చదువులో ఉన్నత స్థానానికి ఎదగడానికి ఏఐబీఈఏ దేశవ్యాప్తంగా ఆర్థికంగా సహకరిస్తుందని అందులో భాగంగా కేతావత్ మౌనిక విద్యభ్యాసం తోపాటు సివిల్స్ శిక్షణకు అయ్యే ఖర్చును భరిస్తుందని వెంకటాచలం తెలిపారు.

జోషిమఠ్‌లో పరిస్థితి ప్రమాదకరం: మమత

కోల్‌కతా: ఉత్తరాఖండ్‌లో విపత్తుకు దెబ్బతిన్న జోషిమఠ్‌లో పరిస్థితి అత్యంత ప్రమాదకరమైందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఈ విపత్తుకు స్థానికులు బాధ్యులు కాదని, కేంద్రం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని ప్రజలను రక్షించాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పటికే భూమి ముంపునకు గురవుతుందన్న అంచనాలు ఉన్నందున ప్రభుత్వం చాలా ముందుగానే చర్యలు చేపట్టి ఉండాల్సిందనిఅన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ్ బర్ధమాన్ జిల్లా రాణిగంజ్ కోల్ బెల్ట్ కూడా క్షీణతకు గురవుతున్నందున జోషిమఠ్‌లో నెలకొన్న పరిస్థితినే ఎదుర్కోవచ్చని మమత అన్నారు. ఇక్కడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మమత మీడియాతో మాట్లాడుతూ... 'కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందన్న హెచ్చరికలు వచ్చినా అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు... జోషిమఠ్‌లో పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది... అయితే దీనికి కొండ ప్రాంత వాసులు బాధ్యులు కాదు... ఏదైనా విపత్తు సంభవిస్తే ప్రభుత్వమే ప్రజలను ఆదుకోవాలి' అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

మేఘాలయలో ప్రభుత్వ మార్పు తథ్యం

మేఘాలయలో ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని మమతాబెనర్జీ అన్నారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే మేఘాలయలో మమత పర్యటించనున్నారు. బుధవారం ఆమె ఉత్తర గారో హిల్స్‌లో జరిగే బహిరంగసభలో ప్రసంగిస్తారు. అసోం-మేఘాలయ సరిహద్దు వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనాల్సి ఉందని మమత చెప్పారు.

కమలనాథుల కుట్రకు నిలువలేని ఆప్

- చండీగఢ్ మేయర్ స్థానం బీజేపీ వశం
- ఓటింగ్‌కు కాంగ్రెస్, అకాలీదళ్ గైర్హాజరు

చండీగఢ్: బీజేపీ కుట్రలకు అమ్‌ఆద్మీపార్టీ (ఆప్) మరోసారి బలి అయింది. చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో మరోసారి బీజేపీ కుట్ర బయటపడింది. కాంగ్రెస్ సభ్యులను తమ పార్టీలో చేర్చుకుని బలం పెంచుకున్నది. 14 వార్డులు గెలిచి అతి పెద్ద పార్టీగా ఆప్ నిలబడినా బీజేపీ కుట్రలను నిలువరించలేక చతికిలపడిపోయింది. దాంతో మేయర్, సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీజేపీ ఖాతాలో పడ్డాయి. కొత్త మేయర్‌గా అనూప్ గుప్తా గెలుపొందగా కాంగ్రెస్, అకాలీదళ్ సభ్యులు ఎన్నికలకు దూరంగా ఉన్నారు. చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ మూడు ముఖ్య పదవులకు మంగళవారం ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 29 మంది ఓటు వేయగా బీజేపీకి 15, ఆప్‌కు 14 ఓట్లు వచ్చాయి. కొత్త మేయర్‌గా బీజేపీ అభ్యర్థి అనూప్ గుప్తా ఆప్ అభ్యర్థి జస్బీర్ లడ్డీని ఒక్క ఓటుతో ఓడించారు. కాంగ్రెస్, అకాలీదళ్ కౌన్సిలర్లు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. శిరోమణి అకాలీదళ్ కార్పొరేటర్ హర్దీప్ సింగ్ ఓటు వేయలేదు. 2016 నుంచి బీజేపీ మేయర్ పదవిని సొంతం చేసుకుంటూ వస్తున్నది. సరబ్జీత్ కౌర్ మేయర్‌గా ఉన్న సమయంలో డిప్యూటీ మేయర్‌గా సేవలందించిన అనూప్ గుప్తా గత ఎన్నికల్లో 11 వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. సీనియర్ డిప్యూటీ మేయర్ పదవి కూడా బీజేపీకే దక్కింది. ఈ ఎన్నికలో మొత్తం 29 ఓట్లు పోలవగా బీజేపీ అభ్యర్థి కన్వర్జిత్ రాణాకు 15 ఓట్లు.

ఆప్ అభ్యర్థి తరుణ మెహతాకు 14 ఓట్లు వచ్చాయి. డిప్యూటీ మేయర్ పదవికి ఆప్ అభ్యర్థి సుమన్ శర్మపై బీజేపీ అభ్యర్థి హర్జీత్ సింగ్ విజయం సాధించారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో 14 వార్డుల్లో ఆప్ అభ్యర్థులు గెలవగా, 12 వార్డుల్లో బీజేపీ విజయం సాధించింది. ఎనిమిది మంది కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. ఒక వార్డు శిరోమణి అకాలీదళ్‌కు దక్కింది. కాగా, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యులు హర్‌ప్రీత్ కౌర్ బబ్లా, గుర్‌చరణ్‌జీత్ సింగ్ కాలా బీజేపీలో చేరారు. దాంతో బీజేపీ బలం 14 కు చేరింది. ఎంపీ కిరణ్ ఖేర్ ఓటు వేయడంతో బీజేపీ మూడు పదవులను దక్కించుకున్నది.

అధికారం శాశ్వతంకాదు

ఎల్జీపై కేజ్రీవాల్ విమర్శల జడివాన

న్యూదిల్లీ: లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా తీరుపై దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శీతాకాల సమావేశాల రెండో రోజు ఢిల్లీ అసెంబ్లీలో మాట్లాడిన ఆయన ఎల్జీ సక్సేనాను బ్రిటిష్ వైస్రాయ్‌తో పోల్చారు. బ్రిటిష్ పాలకుల నియంతృత్వానికి వ్యతిరేకంగానే ఆనాడు దేశ ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాడాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలకు ఎల్జీ అడ్డుపడుతున్నాడని మొదటిరోజైన సోమవారం కేజ్రీవాల్ పేర్కొనగానే అసెంబ్లీలో బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. సభలో గందరగోళం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కూడా కేజ్రీవాల్ తాను చెప్పదలుచుకున్నది గట్టిగానే చెప్పారు. దిల్లీ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను శిక్షణ కోసం ఫిన్‌లాండ్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఎల్జీ అందుకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. దిల్లీలో రెండు కోట్ల జనాభా ఉన్నదని, వారిలో లక్షల మంది చిన్నారులు ఉన్నారని, వాళ్లంతా నా కొడుకు, బిడ్డలాంటి వాళ్లేనని, వాళ్లందరికీ మంచి విద్యను అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ఎల్జీ అడ్డుపడాల్సిన అవసరం ఏమున్నదని కేజ్రీవాల్ ప్రశ్నించారు. టీచర్లకు ఫిన్‌లాండ్‌లో శిక్షణకు సంబంధించిన ఫైల్‌ను ఎల్జీ దగ్గరకు పంపిస్తే ఆయన తిరస్కరించారని సభకు చెప్పారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇవాళ తాము ఢిల్లీలో, వాళ్లు (బీజేపీ) కేంద్రంలో అధికారంలో ఉన్నారని, రేపు కేంద్రంలో తామే అధికారంలోకి రావచ్చని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ మా మనిషే ఉంటారనీ, ఎల్జీకి మా నెత్తిన కూర్చునే అధికారం లేదని మండిపడ్డారు. బ్రిటిష్ వైస్రాయ్‌లా వ్యవహరించవద్దని ఎల్జీకి హితవు పలికారు.

శ్రీనగర్‌లో కాంగ్రెస్ మెగా ర్యాలీకి అనుమతి

జమ్మూ: భారత్ జోడో యాత్ర ముగింపును పురస్కరించుకొని జనవరి 30వ తేదీన శ్రీనగర్‌లో తలపెట్టిన భారీ ర్యాలీ, బహిరంగ సభకు జమ్ముకశ్మీర్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ సభలో దేశ వ్యాప్తంగా 23 రాజకీయ పార్టీల నాయకులు, విదేశీ ప్రతినిధులు కూడా పాల్గొంటారని ఏఐసీసీ జమ్ముకశ్మీర్ ఇన్‌చార్జ్ రజనీ పాటిల్ తెలిపారు. సెప్టెంబర్ 7న తమిళనాడులోని కన్యాకుమారి నుంచి ప్రారంభమైన భారత్ జోడో యాత్ర శ్రీనగర్‌లో రాహుల్ గాంధీ జాతీయ జెండాను ఎగురవేయడంతో ముగియనుంది. ఇప్పటివరకు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, దిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్‌ల్లో భారత్‌జోడో యాత్ర కొనసాగింది. 'యాత్ర గురువారం సాయంత్రం పంజాబ్ నుంచి లఖన్‌పూర్ (జమ్ముకశ్మీర్)లోకి ప్రవేశిస్తుంది. మహారాజా గులాబ్ సింగ్ విగ్రహం దగ్గర సాయంత్రం 5.45 నుంచి 6.15 గంటల మధ్య జెండా అప్పగింత కార్యక్రమం జరుగుతుంది. రాత్రికి అక్కడ బస చేసిన తర్వాత మరుసటి రోజు ఉదయం 7 గంటల నుంచి కతువాలోని హట్లీ మోర్ నుంచి రాహుల్ పాద యాత్ర ప్రారంభిస్తారని పాటిల్ చెప్పారు. పాదయాత్ర జనవరి 23న జమ్మూ చేరుకుంటుంది. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్, ఇతర పార్టీల నాయకులు లఖన్‌పూర్‌లో రాహుల్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొంటారని, మాజీ మంత్రి లాల్ సింగ్ కూడా యాత్రను స్వాగతించాలని పిలుపునిచ్చినట్లు పాటిల్ చెప్పారు. దేశాన్ని ఏకం చేయాలనే రాహుల్ గాంధీ సిద్ధాంతాన్ని, కాంగ్రెస్ సిద్ధాంతాన్ని విశ్వసించే వారెవరైనా యాత్రలో పాల్గొనడాన్ని స్వాగతిస్తున్నామని పాటిల్ అన్నారు.

మధ్యప్రదేశ్‌లో అధ్వాన్నంగా రోడ్లు

క్షమాపణలు చెప్పిన మంత్రి

గ్వాలియర్: డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటూ గొప్పలకు పోతున్న బీజేపీ నాయకులు మధ్యప్రదేశ్‌లోని రోడ్ల దుస్థితిని ఒక్కసారి చూస్తే బాగుంటుంది. అక్కడి రోడ్లు అధ్వానంగా మారడంతో ఆ రాష్ట్ర మంత్రే ప్రజలకు క్షమాపణలు చెప్పారంటే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పనితీరు ఎలాగుందో అర్థం అవుతుంది. ప్రభుత్వ తప్పిదాలకు ప్రజల్లో ఆగ్రహావేశాలు నషాలానికి చేరి దించేయకముందే మంత్రి తమ తప్పులను తెలుసుకుని ప్రాయశ్చిత్తంగా అక్కడి వ్యక్తి కాళ్లు కడిగాడు. రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి ప్రధుమ్నసింగ్ తోమర్ గ్వాలియర్ పర్యటనలో అనేక మంది రోడ్లు వేయాలని కోరారు. డ్రైనేజీ పైపులైను కోసం రోడ్డును తవ్వి వదిలేశారని, గుంతలమయంగా మారిన రోడ్డు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దాంతో తప్పకుండా ఈ రోడ్డు పనులు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇంతలో అదే రోడ్డు మీదుగా బురదలో నడుస్తూ వచ్చిన ఓ వ్యక్తిని ఆపిన మంత్రి తనే ఆయన కాళ్లు కడిగాడు. ఈ ఘటన ప్రభుత్వ వర్గాల్లో సంచలనంగా మారింది. రోడ్లు ఇంత అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

కాగా, మధ్యప్రదేశ్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పేర్కొంటూ ఇదే మంత్రి రోడ్ల మరమ్మతులు చేపట్టేంత వరకు చెప్పులు వేసుకోనని భీష్మ ప్రతిజ్ఞ చేశారు. దాంతో కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా వెంటనే రంగంలోకి దిగి గ్వాలియర్‌లోని రోడ్లకు మరమ్మతు పనులు చేయించారు. అనంతరం ఆయనకు చెప్పులు కూడా తొడిగించారు. ఇప్పుడేమో ఇలా ఒక వ్యక్తి కాళ్లు కడిగి మంత్రి తమ ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

స్కూటీతో వృద్ధుడిని ఈడ్చుకెళ్లిన యువకుడు

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో దారుణం జరిగింది. ఓ యువకుడు తను చేసిన యాక్సిడెంట్ నుంచి తప్పించుకునేందుకు ఒక వృద్ధుడిని స్కూటీతోపాటు కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. బెంగళూరులోని మగది రోడ్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మగది రోడ్డులో ఓ యువకుడు తన స్కూటీతో వృద్ధుడి వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తర్వాత తప్పు తనదేనని గ్రహించిన యువకుడు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దాంతో వృద్ధుడు స్కూటీని వదలకుండా వెనుక నుంచి గట్టిగా పట్టుకున్నాడు. అయినా, ఆ యువకుడు ఆగకుండా వృద్ధుడిని స్కూటీతో ఈడ్చుకెళ్లాడు. ఆ రోడ్డులో వెళ్తున్న వాహనదారులు ఇది గమనించి కేకలు వేసినా యువకుడు పట్టించుకోలేదు. దాంతో తమ వాహనాలను అడ్డుపెట్టి స్కూటీని ఆపేశారు. సమాచారం అందుకున్న గోవిందరాజ్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు.

వేతన జీవులకు ఊరట?

న్యూదిల్లీ: ఆదాయపు పన్నుకు సంబంధించి కొత్త పన్ను విధానంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. కొత్త స్లాబ్‌లు ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. బడ్జెట్‌లో ఆ మేరకు ప్రకటన ఉండే అవకాశం ఉంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సంబంధించి బడ్జెట్‌లో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. కొత్త పన్ను వ్యవస్థలో కీలక మార్పునకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లను తగ్గించి కొత్త పన్ను స్లాబ్‌లను అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. దీనిపై ప్రధాని కార్యాలయం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న పాత పన్ను విధానానికి అదనంగా 2021లో కొత్త పన్ను వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. పాత పన్ను విధానంలో కేవలం మూడు స్లాబ్‌లే ఉండగా కొత్త పన్ను విధానంలో ఆరు స్లాబ్‌లను తీసుకొచ్చారు. రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయంపై 5 శాతం, రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు 10 శాతం, రూ.7.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు 15 శాతం, రూ.10 లక్షల నుంచి రూ.12.5 లక్షల వరకు 20 శాతం, రూ.12.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు 25 శాతం, రూ.15 లక్షలు ఆపైన ఆదాయం కలిగిన వారికి 30 శాతం పన్ను వర్తిస్తుంది. ఏ పన్ను విధానాన్ని ఎంచుకోవాలనే దానిపై పన్ను చెల్లింపుదారులకు స్వేచ్ఛ ఉంది. అయితే, కొత్త విధానంలో పన్ను మినహాయింపులను చూపించేందుకు అవకాశం లేదు. అయితే, ఈసారి బడ్జెట్‌లో మధ్యతరగతికి పెద్దపీట వేయాలని భావిస్తున్న మోదీ సర్కారు ముఖ్యంగా ఆదాయపు పన్ను విషయంలో ఊరటనిచ్చే అంశాన్ని పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. దీనికి తోడు ఈ మధ్యే నిర్మలా సీతారామన్ మధ్య తరగతి అంశాన్ని ప్రస్తావించడం దీనికి బలం చేకూరింది. కొత్త పన్ను విధానంలో మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రూ.15 లక్షలు, ఆపై ఉన్న మొత్తానికి 30 శాతం పన్ను వర్తిస్తోంది. ఈ మొత్తాన్నీ పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది.

పాక్ మహిళతో దావూద్ రెండో పెళ్లి!

ముంబై: అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం గురించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దావూద్ ఇబ్రహీం పాకిస్తానీ మహిళను రెండో వివాహం చేసుకున్నాడని, కరాచీలోని డిఫెన్స్ ఏరియాలోకి నివాసానికి మార్చుకున్నట్టుగా తెలిసింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణలో దావూద్ ఇబ్రహీం దివంగత సోదరి హసీనా పార్కర్ కుమారుడు అలీషా ఇబ్రహీం పార్కర్ ఈ విషయాలను వెల్లడించాడు. దావూద్ ఇబ్రహీం రెండో భార్య పఠాన్ మూలానికి చెందినదని అలీషా తెలిపాడు. అలీషా వాంగ్మూలం ప్రకారం... దావూద్ ఇబ్రహీం తన మొదటి భార్య మెహజబీన్ షేక్‌కు ఇంకా విడాకులు ఇవ్వలేదు. 2022 జులైలో తాను దావూద్ ఇబ్రహీం మొదటి భార్యను దుబాయ్‌లో కలిశానని, అప్పుడు దావూద్ రెండో వివాహం గురించి ఆమె తనకు చెప్పిందని అలీషా పేర్కొన్నాడు. దావూద్ మొదటి భార్య మెహజబీన్ షేక్ వాట్సాప్ కాల్స్ ద్వారా భారత్‌లోని దావూద్ బంధువులతో సంబంధాలు కొనసాగిస్తున్నారని తెలిపాడు. ఇక, 2022 సెప్టెంబర్‌లో ఎన్ఐఏ విచారణలో అలీషా ఇబ్రహీం ఈ విషయాలను వెల్లడించాడు. ఈ కేసుకు సంబంధించి ఏజెన్సీ కోర్టులో ఛార్జిషీట్‌ను కూడా సమర్పించింది. ఇక, ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన కేసులో దావూద్ ఇబ్రహీం, అతని సన్నిహితులపై ఎన్ఐఏ కేసు నమోదు చేసి కొందరిని అరెస్టు చేసింది. దావూద్ ఇబ్రహీం దేశంలోని బడా నేతలు, వ్యాపారులపై దాడి చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కూడా ఎన్ఐఏకు సమాచారం అందింది. వారు పెద్ద నగరాల్లో హింసను వ్యాప్తి చేసే అవకాశం ఉన్నట్లు కూడా తెలిసింది. ఈ కేసు దర్యాప్తు సందర్భంగా దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్ కుమారుడు అలీషా పార్కర్ వాంగ్మూలాన్ని ఎన్ఐఏ నమోదు చేసింది. అయితే అలీ షా వాంగ్మూలంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెహజబీన్ నుంచి దర్యాప్తు సంస్థల దృష్టిని మరల్చడానికి చేసిన ప్రయత్నం కూడా కావచ్చని భావిస్తున్నారు.

మోదీ విధానాలతో పెరుగుతున్న

ఆర్థిక అసమానతలు, పేదరికం: కాంగ్రెస్ విమర్శ

న్యూదిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలతో దేశంలో ఆర్థిక అసమానతలు, పేదరికం పెరుగుతున్నట్లు కాంగ్రెస్ విమర్శించింది. కేవలం ఒక్కశాతం బిలియనీర్ల చేతుల్లో దేశ సంపదలో 40శాతం ఉండగా మిగతా జనాభా వద్ద మూడు శాతమే ఉన్నదన్న ఆక్స్‌ఫామ్ నివేదికను ప్రస్తావిస్తూ బీజేపీ ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టింది. సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతుంటే పేదలు మరింత పేదలై దారిద్ర్య రేఖ దిగువనకు చేరుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆర్థిక అసమానతలను తగ్గించే ఉద్యమమే భారత్ జోడో అని ఆయన హిందీలో ట్వీట్ చేశారు. పేదరికాన్ని పెంచే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేక ప్రజా గళమే 'భారత్ జోడో యాత్ర' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా వ్యాఖ్యానించారు. 21 మంది బిలియనీర్ల వద్ద 70కోట్ల మంది భారతీయుల కంటే ఎక్కువ సంపద ఉన్నదని, ఒక శాతం సంపన్నులు వద్ద భారతీయ సంపదలో 40శాతం ఉన్నదని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. యూపీఏ హయాంలో 20కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కలిగిందని, ప్రస్తుత ప్రధాని 'పేదరికాన్ని పెంచే' విధానాలతో వారంతా తిరిగి పేదరికంలోకి నెట్టబడ్డారని రాహుల్ విమర్శించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల గంతుకగా భారత్ జోడో యాత్ర ఉన్నదని ఆయన ట్వీట్ చేశారు.

కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టిన ప్రశ్నాపత్రాల లీక్

- లీక్ వెనుకన్నున్న వారిని అరెస్టు చేయాలి: పైలట్
- నిందితులపై కఠిన చర్యలు: గెహ్లాట్



జైపూర్: ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ కావడం రాజస్థాన్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరింత ముదిరేందుకు కారణమవుతోంది. సీఎం అశోక్ గెహ్లాట్ లక్ష్యంగా యువ నాయకుడు సచిన్‌పైలట్ విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ యువ నేత సచిన్ పైలట్ సొంత బలాన్ని మరింత పెంచుకునేందుకు పావులు కదుపుతున్నారు. గెహ్లాట్ ప్రభుత్వ వైఫల్యాలపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. నాగౌర్‌లో సోమవారం భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ ఎన్నికల ముంగిట సొంతంగా ప్రచార పర్వం మొదలుపెట్టిన పైలట్ ఇటీవల ఉపాధ్యాయ నియామక పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడాన్ని ప్రస్తావిస్తూ గెహ్లాట్‌ను ఇరుకున పెట్టారు. 'కొన్నిసార్లు పేపర్లు లీక్ అవుతాయి. మరికొన్నిసార్లు పరీక్షలు రద్దవుతాయి. ఇది చాలా బాధాకరం. చదువు కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతారు. పరీక్ష కోసం విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదువుతారు. పేపర్ లీక్ వెనకున్న బడా బాబులను ప్రభుత్వం అరెస్ట్ చేయాలి' అని సొంత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, పేపర్ లీకేజీల వెనుక ఉన్న పెద్ద సొరచేపలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ స్పందించారు. ఆ కేసుల్లో సూత్రధారులు లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. సెకండ్ గ్రేడ్ టీచర్ రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్‌లో తమ పార్టీ నాయకులు లేదా ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందన్న ప్రతిపక్షాల ఆరోపణలను గెహ్లాట్ తోసిపుచ్చారు. 'గతంలో పేపర్ లీక్ కేసుల్లో ప్రమేయం ఉన్నవారిపై రాజస్థాన్ ప్రభుత్వం మాత్రమే కఠిన చర్యలు తీసుకుంది... అనేక మంది అధికారులను సర్వీస్ నుండి తొలగించారు. నిందితుల అక్రమాస్తులపై బుల్డోజరు పరుగెట్టాయి. మోసానికి వ్యతిరేకంగా చట్టం రూపొందించబడింది. మరే రాష్ట్రంలోనైనా ఇలాంటి చర్యలు తీసుకున్నారా?'అని గెహ్లాట్ విలేకరులను ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎంపీ లేదా యూపీలో ఏమి జరుగుతుందో చూడరన్నారు. ఇతర రాష్ట్రాల్లో పేపర్ లీక్‌లు ఉన్నప్పటికీ పరీక్షలు జరిగాయని చెప్పారు. పేపర్ లీక్ కేసుల్లో నిందితులకు ముఖ్యమంత్రి కార్యాలయంలోని సీనియర్ అధికారులతో సంబంధాలున్నాయని బీజేపీ ఎంపీ కిరోడి లాల్ మీనా, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ) ఎంపీ హనుమాన్ బేనివాల్ ఆరోపించారు. తన హయాంలో 1.35 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, మరో 1.25 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, మరో లక్ష పోస్టుల్లో రిక్రూట్‌మెంట్ జరుగుతుందని గెహ్లాట్ వివరించారు. ఈ ఘనత కాంగ్రెస్‌కు దక్కడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని గెహ్లాట్ పేర్కొన్నారు. రాజస్థాన్ సెకండ్ గ్రేడ్ టీచర్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ పేపర్ గత నెల లీక్ కావడంతో ఆ పరీక్షను రద్దు చేశారు. దీనికి సంబంధించి అభ్యర్థులతో సహా 50 మందిని అరెస్టు చేశారు.

ఆలయం కూలి మహిళ మృతి

జైపూర్: ఆలయంలోని కొంత భాగం కూలిపోయిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన రాజస్థాన్‌లోని కరౌలీ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. సపోత్రలోని శివాలయంలో ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఆలయాన్ని పునాది లేకుండా ప్లాట్‌ఫారంపై నిర్మించారని, దాని పక్కనే ఉన్న భూమిపై మట్టి తవ్వుతుండగా ఆలయంలో కొంత భాగం కూలిపోయిందని పోలీసు అధికారులు తెలిపారు.

లిక్కర్ కంపెనీ మూసివేతకు ఆదేశాలు

చండీగఢ్: పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో ఉన్న లిక్కర్ కంపెనీని మూసివేయాలని ఆ రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఆ లిక్కర్ కంపెనీ వల్ల స్థానికంగా పర్యావరణ సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పంజాబ్ గాలిని కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదని, న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత తమ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా జీరా లిక్కర్ ఫ్యాక్టరీ మూసివేతకు ఆదేశాలు జారీ చేసినట్లు సీఎం మాన్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఎవరైనా ఇక్కడి వాతావరణాన్ని కలుషితం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

బడ్జెట్‌లో రైల్వేలకు కేటాయింపులపై ఆసక్తి

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌లో రైల్వే శాఖకు ఏ స్థాయిలో కేటాయింపులు జరుపుతారన్న విషయమై ఆసక్తి నెలకొన్నది. గతంలో రైల్వే బడ్జెట్ అనగానే కొత్త రైళ్లు ఏం ప్రకటిస్తారు? కొత్త లైన్లేంటి? రైళ్లను పొడిగిస్తారా? రేట్లను పెంచుతారా? ఇలా రకరకాల అంచనాలు ఉండేవి. అయితే, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రైల్వే బడ్జెట్‌ను వేరుగా ప్రవేశపెట్టే సంప్రదాయానికి స్వస్తి పలికింది. అప్పటి నుంచి ఈ వ్యవహారం చప్పగా మారింది. రైల్వేకు బడ్జెట్ కేటాయింపుల లెక్కలు మాత్రమే ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో వినిపిస్తున్నాయి. దీంతో ప్రజల్లో రైల్వే బడ్జెట్‌పై ఆసక్తి సన్నగిల్లిందనే చెప్పాలి. జపాన్ సాయంతో ముంబై- అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌ను భారత్ చేపట్టిన సంగతి తెలిసిందే. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2024 చివరి నాటికి అందుబాటులోకి రావాలి. భూసేకరణ, కొవిడ్ వంటి సమస్యలు ఈ ప్రాజెక్ట్‌కు విఘాతంగా మారాయి. దీంతో 2026 నాటికైనా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 110 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణం పూర్తయింది. అనుకున్న సమయానికి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలంటే.. భారీ కేటాయింపులు జరగాలి. కేటాయింపులు జరుపుతారా? అనేది నేడు ఆసక్తిగా మారింది. వేగవంతమైన రైళ్లను నడపాలంటే ప్రస్తుతం ఉన్న ట్రాకుల సామర్థ్యం పెంచడంతో పాటు నెట్‌వర్క్‌ను విస్తరించడం తప్పనిసరి. దీంతోపాటు ఇప్పటికీ పూర్తికాని విద్యుదీకరణ పనులు పూర్తి చేయడం ప్రభుత్వం ముందున్న లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు ఏ మాత్రం చర్యలు తీసుకుంటారనేది విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్వల్పకాలిక లక్ష్యాల కోసం కాకుండా దీర్ఘకాలిక లక్ష్యాల కోసం చర్యలు చేపట్టాలనీ, ఇందులో భాగంగా రాబోయే 25 ఏళ్లకు లక్ష కిలోమీటర్ల మేర కొత్త లైన్లు వేసేందుకు బడ్జెట్‌లో ప్రకటన చేయాలని వారు కోరుతున్నారు. గతేడాది బడ్జెట్‌లో రానున్న మూడేళ్లలో 400 వందేభారత్ రైళ్లను ప్రవేశపెడతామన్న ఆర్థిక మంత్రి ప్రకటన ఏ మాత్రం నెరవేరుస్తారో చూడాలి.

అన్ని వ్యవస్థలు బీజేపీ స్వాధీనం

- మీడియా, ఈసీ, న్యాయవ్యవస్థపై తీవ్ర ఒత్తిడి
- ప్రజాస్వామ్య విధానం కనుమరుగు
- ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని అంగీకరించలేను

రాహుల్ గాంధీ

హోషియార్పూర్: దేశంలోని అన్ని వ్యవస్థలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ స్వాధీనం చేసుకున్నాయని, మీడియా, ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థపై తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థలు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నియంత్రణలో ఉన్నాయని, అన్ని ఇనిస్టిట్యూషన్లపై ఒత్తిడి పెరిగిపోతోందని, ముఖ్యంగా ప్రెస్‌పై, బ్యూరోక్రసీపై, ఎన్నికల కమిషన్‌పై, న్యాయవ్యవస్థపై ఒత్తిడి విపరీతంగా ఉన్నదని రాహుల్ మంగళవారం విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. 'తాజా పరిస్థితుల క్రమంలో జరిగే పోరాటం ఒక రాజకీయ పార్టీకి మరొక పార్టీకి మధ్య కాదని, వ్యవస్థల మధ్య పోరాటంగా అది మారిందని ఆయన న్నారు. దేశంలో సాధారణంగా ఉండాల్సిన ప్రజాస్వామ్య విధానం కనుమరుగైందని ఆందోళన వ్యక్తంచేశారు. సోద రుడు, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీని కలుస్తాను, ఆలింగనం చేసుకుంటానుగానీ ఆ (బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్) సిద్ధాంతాన్ని అంగీకరించలేను.. అది నాకు అసాధ్యం. ఆర్‌ఎస్‌ఎస్ కార్యాల యానికి వెళ్లను. నా గొంతు కోసేసినా సరే ఆ కార్యాల యంలోకి అడుగుపెట్టబోను. నా కుటుంబానికి సిద్ధాంతం... ఆలోచనా విధానం ఉన్నవి' అని ఓ ప్రశ్నకు రాహుల్ బదులిచ్చారు. బీజేపీలో ఉండి భారత్ జోడో యాత్రలో పాల్గొంటే వరుణ్‌గాంధీ చిక్కుల్లో పడతారని పరోక్షంగా చెప్పారు. భారత్ జోడో యాత్ర పంజాబ్‌లో జరుగుతున్న క్రమంలో ఆ రాష్ట్రంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని రాహుల్ విమర్శించారు. పంజాబ్‌ను పంజాబ్ నుంచే పాలించాలిగానీ ఢిల్లీ నుంచి కాదని ఆప్ పాలనను దుయ్యబట్టారు. 'ఇది వాస్తవం. ఢిల్లీ నుంచి పరిపాలన సాగితే పంజాబ్ ప్రజలు అంగీకరించరు. ఇదేమీ రాజకీయం కాదు... వాస్తవం' అని రాహుల్ చెప్పారు. భగవంత్ మాన్ రిమోట్‌తో నియంత్రించే ముఖ్యమంత్రని, రాష్ట్రాన్ని స్వతంత్రంగా పాలించాలన్నారు. రాహుల్ వ్యాఖ్యలకు మాన్ ఘాటుగా స్పందిస్తూ ప్రజలు తనను ముఖ్యమంత్రిని చేశారని... సీఎం పదవి నుంచి అమరిందర్ సింగ్‌ను తప్పించి ఆయనను కాంగ్రెస్ అవమానించిందని అన్నారు. ఇటీవల రాహుల్ అమృత్‌సర్‌లోని స్వర్ణాలయాన్ని సందర్శించారు. దీనిపై సిరోమణి అకాలీ దళ్ ప్రశ్నలు లేవనెత్తడంపై రాహుల్ స్పందిస్తూ 1985 సిక్కుల ఊచకోత వ్యవహారంలో తమ వైఖరిని గతంలోనే స్పష్టంచేశామని రాహుల్ అన్నారు. నాడు మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ, చివరికి నేను కూడా దీనిపై స్పష్టతిచ్చానని ఆయన చెప్పారు. ఇదిలావుంటే, పంజాబ్‌లో రాహుల్ పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. తనను హత్తుకునేందుకు ఓ వ్యక్తి దూసుకొచ్చిన ఘటనపై స్పందిస్తూ 'అది భద్రతా వైఫల్యమని ఎందుకు అంటున్నారో అర్థం కావడంలేదు. భద్రతా సిబ్బంది ఆయనను తనిఖీ చేశారు కాకపోతే ఆయన కాస్తంత అత్యుత్సాహాన్ని ప్రదర్శించాడు.

ఔత్సాహికులు చాలా మందే ఉన్నారు. ఇదేమీ సమస్య కాదు. ఇలా చాలాసార్లు జరిగింది. తమ ఆనందాన్ని పట్టలేక కొందరు అత్యుత్సాహాన్ని ప్రవర్తిస్తుంటారు. దీనిని భద్రతా వైఫల్యమని అనుకోను' అని రాహుల్ అన్నారు. గతేడాది సెప్టెంబరు 7న తమిళనాడులోని కన్యాకుమారి నుంచి మొదలైన భారత్ జోడో యాత్ర ఈనెల 30వ తేదీన శ్రీనగర్‌లో ముగియనుంది. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్ వేసవి రాజధానిలో జాతీయ పతాకాన్ని రాహుల్ ఆవిష్కరించారు. భారత్ జోడో యాత్ర తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో విజయవంతమైన సంగతి తెలిసిందే.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం

20 నుంచి సమరయాత్ర

జయప్రదానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు తలపెట్టిన యువజన, విద్యార్థి సంఘాల సమరయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ యాత్ర జయప్రదానికి ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుల సమావేశం మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన వర్చువల్‌గా జరిగింది. విజయవాడలోని చంద్రంబిల్డింగ్స్ నుంచి సీపీఐ నేత రామకృష్ణతో పాటు రాజేంద్రబాబు పాల్గొన్నారు. అన్ని జిల్లాల నుంచి ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు 1,800 కిమీల యాత్రను 16రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం జగన్ నిత్యం ఢిల్లీ వెళ్లి కేంద్రానికి అర్జీలిస్తూ, వాటిని మీడియాకు వెల్లడిస్తున్నారే తప్ప, అర్జీ తీసుకున్న కేంద్రం పెద్దలు ఏమి చెప్పారో బయటకు రాలేదన్నారు. ఆ విషయాలను కేంద్రం వెల్లడించకుండా రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నాదన్నారు. విద్యార్థి, యువజన సంఘాలన్నీ విశ్వవిద్యాలయాలు, కళాశాలలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్నికల అవసరం ఆధారంగా ప్రత్యేక హోదా అజెండాగా మారుతుందన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదాపై ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా అనేదీ రాజకీయ పార్టీలకు సంబంధించినది కాదని, రాష్ట్ర యువత భవిష్యత్తని నొక్కిచెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన చట్ట హామీలను అమలు చేయకుండా ఏపీకి కేంద్రం ద్రోహం చేసిందని విమర్శించారు. దీంతో విద్యార్థి, యువజనులు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమరయాత్రలో విద్యార్థి, యువజనులు పాల్గొని, విభజన హామీల సాధన కోసం ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి పాల్గొన్నారు.

ఓపీఎస్‌కు మార్గదర్శకాలివ్వండి

సిమ్లా: హిమచాల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ పథకం (ఓపీఎస్) ప్రయోజనాలు అందనున్నాయి. ఈ పథకం అమలుకు ఎస్‌ఓపీలు, మార్గదర్శకాలు నోటిపై చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 1.36 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నట్లు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రబోద్ సక్సేనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి ఎస్‌ఓపీలు, నియమ-నిబంధనలు, షరతలను ఆర్థికశాఖ క్రమంగా జారీ చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశంలో ఓపీఎస్ పునరుద్ధరణకు ఆమోదం తెలిపింది.

ఆలయాల నిర్మాణం వేగవంతం

అధికారులకు దేవాదాయశాఖ మంత్రి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రీవాణి ట్రస్టు ఆర్థిక సహాయంతో చేపట్టిన 980 ఆలయాల నిర్మాణ పనులన్నీ ఫిబ్రవరి 1 కల్లా గ్రౌండ్ చేయాలని ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయం రెండో బ్లాక్ నుంచి అన్ని జిల్లాల దేవాదాయశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, దేయాలయాల నిర్మాణ పనుల ప్రగతిని సమీక్షించారు. జిల్లాల వారీగా మంజూరు చేసిన దేవాల యాలు, వాటిలో గ్రౌండ్ అయిన పరిస్థితిపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో హిందూ దేవాలయాలను నిర్మించేందుకు శ్రీవాణి ట్రస్టు ఆర్థిక సహాయంతో 980 దేవాలయాలను మంజూరు చేశామన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ దేవాలయాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ల ప్రమేయం ఏమాత్రం లేకుండా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకే వీటి నిర్మాణ పనుల బాధ్యతను అప్పగించామని తెలిపారు. దేవాలయాల నిర్మాణ పనుల పురోగతి ఆశాజనకంగా లేకపోవడం, సత్తనడకగా సాగడాన్ని ఆయన గమనించి, ఈ దేవాలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, వాటిని సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల ఎండోమెంట్ అధికారులు తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ దేవాలయాల నిర్మాణ పనులును పర్యవేక్షిస్తుండాలని, ఆయా దేవాలయాల పురోగతి కనిపించే విధంగా సెల్ఫీలతో ఫొటోలు దిగుతూ వాటిని ఉన్నత అధికారులకు పంపాలన్నారు. ఇప్పటివరకు ప్రతి 30 దేవాలయాలకు ఒక ఏఈ నియమించుకునేందుకు అవకాశం ఇవ్వాలని, ఇంజనీరింగ్ అభ్యర్థులు దొరక పోయినా కనీసం డిప్లొమా అభ్యర్థులను ఏఈలుగా నియమించుకుని దేవాలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులకు సంబంధించి పటిష్ట డీపీఆర్ రూపొందించాలన్నారు. ఈ దేవస్థానం అభివృద్ధికి సంబంధించి అధికారులు రూపొందించిన అంచనాలు, ప్రణాళికలపై సమగ్రంగా మంత్రి చర్చించారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మా దాయ శాఖఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎం.హరి జవహర్‌లాల్, అదనపు కమిషనర్లు టి.చంద్రకుమార్, కె.రామచంద్రమోహన్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'సార్' నుంచి సుద్దాల గీతం విడుదల

హైదరాబాద్: శ్రీశ్రీ, వేటూరి తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు గీత రచయిత సుద్దాల అశోక్ తేజ. మూడు దశాబ్దాల సినీ జీవితంలో ఆయన ఎన్నో అద్భుతమైన, అందమైన పాటలకు ప్రాణం పోశారు. తాజాగా ఆయన కలం నుంచి మరో మధుర గీతం జాలు వారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ధనుష్ హీరోగా తెరకెక్కిస్తున్న 'సార్' సినిమా చిత్రీకరణ ముగింపు దశలో ఉండగా, చిత్ర బృందం చిత్రానికి సంబంధించిన 'బంజారా' అనే పాటను మంగళవారం విడుదల చేసింది. 'ఆడవుంది నీవే ఈడ ఉంది నీవే నీది కానీ చోటే లేనేలేదు బంజారా' అంటూ అంటూ సుద్దాల అశోక్ తేజ అందించిన సాహిత్యం హృదయాన్ని హత్తుకునేలా ఉంది. 'ఏదీ మన సొంతం కాదు. కష్టాలు, సుఖాలు శాశ్వతం కాదు. ఈ క్షణాన్ని ఆస్వాదించడమే జీవితం' అనే అర్థమొచ్చేలా పదునైన మాటలతో, లోతైన భావంతో ఆయన కలం నుంచి జాలువారిన అక్షరాలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. సుద్దాల అద్భుత సాహిత్యానికి అంతే అద్భుతంగా జి వి ప్రకాష్ స్వరాలు సమకూర్చగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. తాజాగా విడుదలైన 'బంజారా' లిరికల్ వీడియో ఆకట్టుకుంటోంది. అందులోని లోకేషన్లు పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయి. కథానాయకుడు ఊరిలో వాళ్ళతో కలిసి నాట్యం చేయడం, అలాగే హోటల్ లో స్నేహితులతో కలిసి తిని బయటకు వచ్చాక అక్కడున్న చిన్నారికి డబ్బు సాయం చేయడం వంటివి అతని పాత్ర తీరుని, స్వభావాన్ని తెలియజేస్తున్నాయి. గీతం లోని సాహిత్యానికి అద్దం పట్టేలా కథానాయకుడి పాత్ర ఉంది. అలాగే ఈ లిరికల్ వీడియోలో పెళ్లి బృందంతో కలిసి సంగీత దర్శకుడు జి.వి ప్రకాష్, గాయకుడు అనురాగ్ కులకర్ణి నాట్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంగీతానికి తగ్గట్లుగా నృత్య దర్శకుడు విజయ్ బిన్ని అందించిన స్టెప్పులు ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల అయిన ప్రచార చిత్రాలు, 'మాస్టారు మాస్టారు' గీతం ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో 17 ఫిబ్రవరి, 2023 న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

టీమిండియా క్రికెటర్లతో జూనియర్ ఎన్టీఆర్ మాటామంతీ

హైదరాబాద్: న్యూజిలాండ్ జట్టుతో వన్ డే క్రికెట్ మ్యాచ్ ఆడటానికి వచ్చిన భారజట్టు ఆటగాళ్లు కొందరిని జూనియర్ ఎన్టీఆర్ కలిశాడు. ఇందులో సూర్యకుమారి యాదవ్, శుబ్ మన్ గిల్, ఇషాన్ కిషన్, యుజువేంద్ర చహల్, శార్దుల్ ఠాకూర్ మొదలైనవారున్నారు. ఇంకా కొంతమంది వున్నారు. కొంతమంది భారత ఆటగాళ్లకు నజీర్ ఖాన్ మంచి స్నేహితుడు అవటం వల్ల వీరు అతని ఇంటికి వచ్చారు. అదే నజీర్ ఖాన్ జూనియర్ ఎన్టీఆర్ కి కూడా స్నేహితుడు కావటం తో అక్కడకి వచ్చి ఈ ఆటగాళ్లను కలిసినట్టుగా సమాచారం. ఆర్ఆర్ఆర్‌లో జూనియర్ ఎన్టీఆర్ నర్తించిన పాట 'నాటు నాటు' కి ఈమధ్యనే అంతర్జాతీయంగా అవార్డులు రావటం తెలిసిందే. ఈ సందర్భంగా వీరందరూ జూనియర్ ఎన్టీఆర్ కి తమ శుభాకాంక్షురాలు చెప్పినట్లు తెలిసింది. అలాగే జూనియర్ ఎన్టీఆర్ సూర్యకుమార్ యాదవ్‌తో ఈమధ్య టీ20 లో చేసిన శతకం గురించి ప్రస్తావించినట్టుగా తెలిసింది. అలాగే మిగతా క్రికెట్ ఆటగాళ్లతో కూడా జూనియర్ ఎన్టీఆర్ పిచ్చాపాటీ మాట్లాడి నట్టుగా తెలుస్తోంది. క్రికెట్ ప్లేయర్స్ జూనియర్ ఎన్టీఆర్ తదుపరి చిత్రం గురించి అడిగి తెలుసుకున్నారని కూడా తెలిసింది.

భోళాశంకర్ చిత్రీకరణ ప్రారంభం

హైదరాబాద్: వాల్తేరు వీరయ్య సినిమా హిట్‌తో మంచి ఊపుమీదనున్న మెగాస్టార్ చిరంజీవి... తన తదుపరి సినిమా భోళాశంకర్‌పై దృష్టి పెట్టారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కు తున్న ఈ సినిమా షూటింగ్ మంగళవారం పునః ప్రారంభమైంది. రామబ్రహ్మం సుంకర భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ హైదరాబాద్‌లోని భారీ కోల్‌కతా సెట్‌లో కొనసాగింది. వాల్తేరు వీరయ్యతో చిరంజీవి భారీ బ్లాక్ బస్టర్ సాధించడంతో భోళా శంకర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మెహర్ రమేష్, చిరంజీవిని స్టైలిష్, ఇంకా మాస్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రంలో నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ చిరంజీవికి సోదరిగా నటిస్తుండగా, తమన్నా కథానాయికగా కనిపించనుంది. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మహతి స్వర సాగర్ సంగీతం అందించగా, డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు.

'జైలర్' ముఖ్య పాత్రలో సునీల్

చెన్నై: రజనీకాంత్ కథానాయకుడిగా 'జైలర్' సినిమా రూపొందుతోంది. సన్ పిక్చర్స్ వారు నిర్మిస్తున్న ఈ సినిమాకి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాలో రజనీకాంత్ 'జైలర్'గా డిఫరెంట్ లుక్ తో కనిపించనున్నారు. కథ అంతా కూడా జైలుతో ముడిపడిన జైలర్ చుట్టూ తిరుగుతుంది. ఈ సినిమాలో సునీల్ ఒక ముఖ్య పాత్రను పోషిస్తున్నాడు. ఆయన లుక్ కి సంబంధించిన పోస్టర్ ను మంగళవారం విడుదల చేశారు. ఆయన పాత్ర, బాడీ లాంగ్వేజ్ కూడా వైవిధ్యంగా ఉండనున్నాయనే సంగతి ఈ పోస్టర్ చూస్తుంటేనే అర్థమవుతోంది. ఇక ఇతర ముఖ్యమైన పాత్రలలో రమ్యకృష్ణ .. శివరాజ్ కుమార్ .. యోగబాబు కనిపించనున్నారు. ప్రత్యేకమైన పాత్రను మోహన్ లాల్ పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ సినిమాను, ఏప్రిల్ 14వ తేదీన తమిళంతో పాటు ఇతర భాషల్లోను విడుదల చేయనున్నారు.

నేడు భారత్-కివీస్ తొలి వన్డే

హైదరాబాద్: భారత్-న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జనవరి 18న తొలి మ్యాచ్ జరగనుంది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఇరు జట్ల మధ్య ఈ మ్యాచ్ జరగనుంది. టీమిండియాతోపాటు కివీస్ జట్టు ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నాయి. వన్డే సిరీస్‌లో ఇరు జట్ల మధ్య ఆసక్తికరమైన మ్యాచ్ జరగనుంది. భారత్, న్యూజిలాండ్ తమ చివరి వన్డే సిరీస్‌ను గెలుచుకుని బరిలోకి దిగనున్నాయి. పాకిస్థాన్ పర్యటనలో, కివీస్ వన్డే సిరీస్‌లో ఆతిథ్య జట్టును 2-1తో ఓడించింది. అదే సమయంలో వన్డే సిరీస్‌లో భారత్ 3-0తో శ్రీలంకను ఓడించింది. న్యూజిలాండ్ జట్టు తొలిసారి హైదరాబాద్ వేదికగా వన్డే మ్యాచ్ ఆడనుంది.

ఆ నలుగురిలో తొలి వన్డే ఆడే ఛాన్స్ ఎవరికో?

ఈ సిరీస్‌కు తుది జట్టును ఎంచుకోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌కు క్లిష్టంగా మారింది. ఎందుకంటే ప్రస్తుతం చర్చ అంతా సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్‌ల గురించే జరుగుతోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు ఫామ్‌లో ఉన్నారు. బాగా రాణిస్తున్నారు. అదే సమయంలో యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ విషయంలో కూడా సమస్య ఉండవచ్చు. బీసీసీఐ వన్డే ప్రపంచ కప్ 2023 కోసం సన్నాహాలు ప్రారంభించింది. ఈ కోణంలో న్యూజిలాండ్‌తో సిరీస్ ఎంతో కీలకంగా మారింది. ఇషాన్ కిషన్ బంగ్లాదేశ్‌పై డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 126 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. అయితే ఇంత జరిగినా శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అతనికి అవకాశం రాకపోవడం గమనార్హం. ఇషాన్ కిషన్ స్థానంలో శుభ్‌మన్ గిల్ ఓపెనింగ్‌కు వచ్చాడు. మరి ఇప్పుడు వికెట్‌కీపర్‌గా ఇషాన్ రంగంలోకి దిగుతాడా లేదా అనేది చూడాల్సి ఉంది. సూర్యకుమార్‌తో పోటీ పడేందుకు సిద్ధమయ్యాడు. రాజ్‌కోట్ టీ20లో సూర్య సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. ఇక టీమ్ ఇండియా స్పిన్ బౌలర్లు కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్ కూడా ఫామ్‌లో ఉన్నారు. ఈ ఇద్దరిలో ఎవరినైనా ఎంచుకోవడంలో సెలెక్టర్లు ఇబ్బంది పడవచ్చని తెలుస్తోంది. శ్రీలంకతో కోల్‌కతా వన్డేలో కుల్దీప్ 3 వికెట్లు పడగొట్టాడు. అలాగే తిరువనంతపురంలో 2 వికెట్లు తీశాడు. చాహల్ రాజ్‌కోట్‌లో 2 వికెట్లు, పుణెలో ఒక వికెట్ తీశాడు. ఈ రెండూ టీ20 మ్యాచ్‌లే. వన్డేల్లో ఒక వికెట్ పడగొట్టాడు. ఇంతకు ముందు కూడా ఈ ఇద్దరు ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

తొలి సిరీస్ విజయం కోసం న్యూజిలాండ్ ఎదురుచూపులు

భారత గడ్డపై తొలి వన్డే సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు న్యూజిలాండ్ ఎదురుచూస్తోంది. భారత గడ్డపై కివీస్ జట్టు ఇప్పటి వరకు 6 సార్లు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడింది. అయితే ప్రతిసారీ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. 1988-89లో వన్డే సిరీస్ ఆడేందుకు న్యూజిలాండ్ తొలిసారిగా భారత్‌కు వచ్చింది. గత 34 ఏళ్లలో న్యూజిలాండ్ 6 సార్లు భారత్‌లో పర్యటించింది. కానీ, వన్డే సిరీస్‌లో ఒక్కసారి కూడా విజయం సాధించలేదు. 2003-04లో భారత గడ్డపై న్యూజిలాండ్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. ఆపై ముక్కోణపు సిరీస్‌లో కివీస్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. టీవీఎస్ కప్ టైటిల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది.

మళ్లీ క్రికెట్ సందడి

భాగ్యనగరంలో మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ సందడి మొదలైంది. గత సెప్టెంబర్ లో భారత్, ఆస్ట్రేలియా మధ్య టీ20 అభిమానులను ఎంతగానో అలరించింది. ఇప్పుడు భాగ్యనగర అభిమానులకు వన్డే మ్యాచ్ రుచి చూపించేందుకు భారత్, న్యూజిలాండ్ జట్లు వచ్చాయి. మూడు వన్డేల సిరీస్ లో భాగంగా బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఇరు జట్ల మధ్య తొలి వన్డే జరగనుంది. ఇందుకోసం న్యూజిలాండ్ క్రికెటర్లు శనివారమే నేరుగా హైదరాబాద్ చేరుకున్నారు. శ్రీలంకతో ఆదివారం మూడో వన్డేలో గెలిచిన తర్వాత టీమిండియా సోమవారం రాత్రి ఇక్కడకు వచ్చింది. కివీస్ జట్టు సోమవారం సాయంత్రం ఉప్పల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసింది. మ్యాచ్ కు మరో రోజు మాత్రమే ఉంటడంతో ఇరు జట్లూ మంగళవారం ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యాయి.

శ్రేయాస్ అయ్యర్ స్థానంలో రజత్ పటిదార్

న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు శ్రేయాస్ అయ్యర్‌ను పక్కన పెట్టేశారు. అతని స్థానంలో టీమిండియా జట్టులోకి రజత్ పటిదార్‌ను తీసుకున్నారు. వెన్ను నొప్పి వల్ల అయ్యర్‌ను తప్పించినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల శ్రీలంకతో ముగిసిన వన్డే సిరీస్‌లో అయ్యర్...భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. మూడు సార్లు మంచి స్టార్ట్ తీసుకున్నప్పటికీ పెద్ద స్కోర్లు చేయలేకపోయాడు.

ఉప్పల్ స్టేడియం వద్ద భద్రత కట్టుదిట్టం

విశాలాంధ్ర - హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో జరిగే ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ కు అన్ని ఏర్పాట్లు చేసామని రాచకొండ కమిషనర్ డి.ఎస్.చౌహన్ తెలిపారు. మ్యాచ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 2500 మంది తో భారీ బందోబస్త్ ఏర్పాటు చేసామని వివరించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 1 గంట నుండి అభిమానులను స్టేడియంలోకి లోపలికి అనుమతి ఇస్తామన్నారు. సాయంత్రం గ్రౌండ్ లో క్రౌడ్ పెరిగే అవకాశం ఉందన్నారు. అభిమానులు గ్రౌండ్ లోపలికి ఎవ్వరు రాకూడదని, ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసామని అభిమానులు వీటిని వినియోగించుకుని సహకరించాలన్నారు. మహిళలు పట్ల ఎవ్వరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆకతాయిలను కోసం షీ టీమ్స్ తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసామన్నారు. ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని కావున వాహనదారులు దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాలన్నారు. 12 గంటల నుండి స్టేడియం లోపలికి అనుమతి ఇస్తామని అలాగే ఎక్కడైనా బ్లాక్ లో టికెట్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

హార్దిక్‌సింగ్‌కు గాయం...భారత్‌కు ఎదురు దెబ్బ

హైదరాబాద్: పురుషుల హాకీ ప్రపంచ కప్‌లో భారత్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మిడ్‌ఫీల్డర్ హార్దిక్‌సింగ్ గాయం కారణంగా టోర్నీకి దూర మ య్యాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ తొడ కండరాల గాయంతో బాధపడ్డాడు. ఆ మ్యాచ్ అనంతరం వైద్యులు స్కానింగ్ చేయగా, అతడి గాయం తీవ్రంగా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయి. ఇక అతడి స్థానంలో ఎవరిని తీసుకోవాలన్న విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. కాగా హార్దిక్ భారత జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నా డు. స్పెయిన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో అతడు అద్భుతమైన గోల్‌తో మెరిశాడు. ఇంగ్లాండ్ మ్యాచ్‌లో కూడా గోల్ సాధించేం దుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఇకపోతే గ్రూపు-డీలో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో భారత జట్టు... తదుపరి మ్యాచ్‌ను జనవరి 19న వేల్స్‌తో ఆడనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.